


# విజయభాను

హైదరాబాద్, ఆదివారం 27-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 345 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రపంచ స్థాయి గైడ్స్ శిబిరానికి వర్ష

### కౌలాలంపూర్ పయనం



కవాడిగూడ: కౌలాలంపూర్‌లో జరుగనున్న అంతర్జాతీయ గైడ్స్ శిబిరంలో పాల్గొనేందుకు కర్రె వర్ష నగరం నుంచి బయలు దేరారు. దోమలగూడలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యాలయంలో అధికారులు ఆమెకు తరువాయి 2లో

## విజ్ఞానానికి పుస్తకమే పునాది



కరీంనగర్ : పుస్తకాలే ప్రపంచ జ్ఞానానికి మూల కారణమని, వాటితోనే మానసిక వికాసం జరిగి మనిషి పరిపక్వ వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటారని శాసన మండలి సభ్యుడు నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. స్థానిక ఫిలింభవన్‌లో తరువాయి 2లో

### ఆకలి, అవిద్య, అసమానతలు తొలిగినప్పుడే

# దేశ పురోగతి

- తెలుగు రాష్ట్రాలు అభివృద్ధికి కృషిచేయాలి
- తెలుగుభాషను పరిరక్షించండి
- చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరగాలి
- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

అమరావతి: తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలహించుకోకుండా కలిసి మెలిసి పనిచేయాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. తెలుగు భాషను





పరిరక్షించాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని తరువాయి 2లో

## బక్రీదు అనంతరం మక్కామసీదుకు మరమ్మతులు

- రూ.8.40 కోట్లు అవసరం
- ప్రణాళికలు సిద్ధం



చార్మినార్: చారిత్రాత్మక మక్కామసీదుకు మరమ్మతులు చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం చూస్తుందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ మహ్మద్ సలీం అన్నారు. మక్కామసీదు మరమ్మతులకు రూ.8.40 కోట్ల నిధులు వ్యయం అవుతుందని అధికారులు ప్రణాళిక సిద్ధం చేయడంతో రూ.కోటిని వెంటనే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆర్కియాలజీ విభాగం పర్యవేక్షణలో మక్కామసీదు మరమ్మతులు తరువాయి 2లో

## ఆ ప్రచారం అవాస్తవం

- జగన్‌ను కలుపుకునే ఆలోచన లేదు
- పొత్తుల గురించి అగ్రనాయకత్వం ఆలోచిస్తుంది
- భాజపా నేత పురందేశ్వరి

కాకినాడ: భాజపా, వైకాపా కలవబోతున్నాయంటూ వస్తున్న ప్రచారం పూర్తి అవాస్తవమని భాజపా నేత పురందేశ్వరి తెలిపారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ తెలుగుదేశంతో కలిసే ఉన్నామని పేర్కొన్నారు.

అదే పొత్తు కొనసాగుతుందని స్పష్టంచేశారు. పొత్తుల గురించి ఢిల్లీలోని అగ్ర నాయకత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం జగన్‌ను కలుపుకొనే ఎలాంటి ఆలోచనా భాజపాకు లేదని వెల్లడించారు. కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కాకినాడ వచ్చిన ఆమె జగన్, భాజపా పొత్తు గురించి విలేకర్లతో మాట్లాడారు.



## గోల్డ్‌డ్రాప్ వంటనూనెకు సీఐటీడీ గుర్తింపు



మెహిదీపట్నం: కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ ఇండియా (సీఐటీడీ) సంస్థ.. తరువాయి 2లో

## గుర్మీత్‌కు 'జడ్' కేటగిరి భద్రత రద్దు..

- హరియాణాలో విధ్వంసం
- పెచ్చుమీరుతున్న అల్లర్లు
- మృతుల సంఖ్య 31
- క్షతగాత్రులు 300కి పైమాటే
- పంచకులలో 144 సెక్షన్
- డీసీపీ అశోక్‌కుమార్ సస్పెన్షన్



చండీగఢ్: అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌధా గురువు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చడంతో ఆయన అనుచరులు పంజాబ్, హరియాణాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని పంచకుల ప్రాంతంలో 144 సెక్షన్ విధిస్తున్నట్లు డీసీపీ అశోక్‌కుమార్ ప్రకటించారు. అయితే ఈ నిబంధన విషయంలో ఆయన స్పష్టత ఇవ్వకపోవడంతో అల్లర్లు ఇంకా పెచ్చుమీరాయి. 144 సెక్షన్ విధించినపుడు.. ఎవరైనా ఆయుధాలతో సంచరించినా, నలుగురైదుగురు ఒకే చోట గుమిగూడినా చర్యలు తీసుకుంటారు. ఆయుధాలతో కనిపిస్తే మాత్రమే చర్యలు తీసుకుంటామని డీసీపీ చేసిన ప్రకటన వల్లే హింస పేట్రేగిందని భావించిన హర్యానా పోలీసు శాఖ అశోక్‌కుమార్‌ను సస్పెండ్ చేసింది.

డేరా బాబాను కోర్టు దోషిగా తేల్చిన నేపథ్యంలో ఆయన అనుచరులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఇది విధ్వంసకరంగా మారింది. బాబా అనుచరులు పెట్రోల్, డీజిల్ బాంబులతో తరువాయి 2లో




### రాష్ట్రానికి

## రూ.500 కోట్లు ఇస్తా

### సీఎంకు మోదీ హామీ



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బిహార్ వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. రూ.500 కోట్లు తరువాయి 2లో




## ప్రయివేటు వైద్య పరీక్ష కేంద్రాలపై జిల్లా వైద్యశాఖ దాడులు


### అనుమతులు లేని రెండు కేంద్రాలపై చర్యలకు రంగం సిద్ధం

### దొరికిన గర్భ నిర్ధారణ కిట్

హైదరాబాద్: జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ శ్రీరామ్ ఆదేశాల మేరకు గార్లలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రయివేటు వైద్య పరీక్ష కేంద్రాల (ల్యాబ్)పై గురువారం జిల్లా వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న హర్ష డయాగ్నస్టిక్ సెంటర్‌లో ప్రభుత్వపరంగా నిర్వహించాల్సిన గర్భ నిర్ధరణ పరీక్ష పరికరాన్ని జిల్లా వైద్యధికారులు స్వాధీనం చేసుకున్నారు.

గతంలో ఇదే డయాగ్నస్టిక్ సెంటర్‌లో అనుమతి పత్రాలు లేకుండా ఎక్స్‌రే ప్లాంటును నిర్వహిస్తున్న క్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సెంటర్‌ను మూసివేయాల్సిందిగా ఆదేశించారు. అయినప్పటికీ ఎక్స్‌రేప్లాంటును యథాతథంగా ఇక్కడ నిర్వాహకుడు కొనసాగించడం విశేషం. తాజాగా జిల్లా వైద్యశాఖాధికారులు, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో మళ్లీ ఎక్స్‌రేప్లాంటు యథారీతిన కొనసాగిస్తుండటంతో వైద్యాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడురోజుల్లో అనుమతి పత్రాలను సమర్పించాల్సిందిగా నిర్వాహకుడిని ఆదేశించారు. ఇదే డయాగ్నస్టిక్ సెంటర్ ఎదురుగా ఉన్న చక్ర డయాగ్నస్టిక్ సెంటర్‌ను పరిశీలించారు. అనుమతి పత్రాలు లేకుండా డయాగ్నస్టిక్ కేంద్రాలను నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజేశ్ హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వైద్య పరీక్ష కేంద్రాలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డయాగ్నస్టిస్ సెంటర్లపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు. ఓఎస్డీ గోవర్దన్, సహాయకులు శ్రీహరి వెంట ఉన్నారు.

## టేకిట్-ఈజీ



రోజమ్మ ప్రచారాన్ని తిప్పికొట్టకపోతే మరీ రెచ్చిపోతారేమో ఆలోచించాలి!!

## భావితరాలకు ఉపాధి ఫలాలు



కాటారం: పల్లె జీవన విధానంలో మార్పు రావాలి..పేద ప్రజల జీవనోపాధి మెరుగు పడాలి..భావి తరాల భవిష్యత్తుకు ఉపాధి ఫలాలు అందాలి..ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా పాలనాధికారి అకునూరి మురళి అన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కాటారం మండలం మేడిపల్లి అటవీ ప్రాంతంలో చేపట్టిన హరితహారం కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. భావి తరాలకు ఉపాధి వెలుగులు అందించాలన్న ఉద్దేశంతో ప్రత్యేక కార్యచరణ ప్రణాళికతో పండ్ల తోటల పెంపకం అమలు చేస్తున్నామని వెల్లడించారు తరువాయి 2లో



మొదటి పేజీ తరువాయి

## రాష్ట్రానికి రూ.500 కోట్లు ఇస్తా

తక్షణ సహాయం ప్రకటించారు. ఈ బీభత్సంలో మరణించినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని పేర్కొన్నారు. వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపిస్తామని తెలిపారు. పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అత్యవసరంగా సిబ్బందిని పంపించాలని బీమా కంపెనీలను కోరారు. రైతులకు సహాయం సాధ్యమైనంత త్వరగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏరియల్ సర్వేలో మోదీతో పాటు బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా పాల్గొన్నారు. సర్వే అనంతరం బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో మోదీ, నితీశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలోనే తక్షణ సహాయంపై మోదీ నిర్ణయం తీసుకున్నారు. వాయు సేనకు చెందిన చునాపూర్ విమానాశ్రయంలో ఈ సమావేశం జరిగింది. మోదీ ఇక్కడి నుంచి తిరిగి న్యూఢిల్లీ వెళ్ళారు.

## ఆకలి, అవిద్య, అసమానతలు తొలిగినప్పుడే దేశ పురోగతి

మాట్లాడారు. రాజ్యాంగబద్ధ పదవిని అలంకరించిన తర్వాత అడుగుపెట్టిన తనకు అపూర్వ స్వాగతం లభించడం తనకు సంతోషంగా ఉందన్నారు.

రిటైర్డ్.. ఐయామ్ నాట్ టైర్డ్

ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తాను ఆ పదవి స్థాయిని పెంచేందుకు కృషి చేస్తానని వెంకయ్యానాయుడు అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చి 40 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. నేను రాజకీయాల నుంచి రిటైర్ అయినప్పటికీ ఐయామ్ నాట్ రిటైర్డ్ అంటూ తన వాగ్దాటిని మరోసారి చాటారు. చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరగాలని సూచించారు. ప్రతిపక్షాలకు కూడా మాట్లాడేందుకు అవకాశమివ్వాలని, అదే విధంగా ప్రతిపక్షాలు సైతం అర్థవంతమైన చర్చలకు ముందుకు రావాలని సూచించారు.

ఆకలి, అవిద్య, అసమానతలు తొలిగినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు అన్నారు. ప్రధాని, సీఎం, మంత్రి నీతిమంతంగా ఉన్నంత మాత్రన అవినీతి లేనట్లు కాదని, కిందిస్థాయిలో కూడా పరిస్థితి మారాలన్నారు. నేటికీ కులం పేరుతోనూ, మతం పేరుతోనూ వివక్ష చూపడం సరికాదన్నారు.

అప్పట్లో సంశయించా..

విభజన బిల్లుపై చర్చ సందర్భంగా ఏపీ తరపున ఎంపీని కానప్పటికీ ఒక జాతీయ పార్టీ నాయకుడిగా ఒక రాష్ట్రంలోని ఒక ప్రాంతం గురించి రాజ్యసభలో మాట్లాడడం సరికాదని అనిపించిందన్నారు. అయినా మూడు రోజుల పాటు ఆలోచించాక రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చూడలేక రాష్ట్రం తరపున మాట్లాడానని వెంకయ్య చెప్పారు. ఏ రాష్ట్రానికీ చేయని స్థాయిలో ఏపీకి న్యాయం చేశానని అన్నారు.

ఆ కోరిక ఉండిపోయింది ..

2020 తర్వాత ప్రజల్లో ఉండాలన్నదే తన కోరిక అని, కానీ అది తీరలేదని వెంకయ్య చెప్పారు. 2019లో భాజపాను గెలిపించాక పార్లమెంట్ సభ్యుడిగా రాజీనామా చేసి 2020 సంక్రాంతికి ఇంటికెళ్లి పండగ జరపుకోవాలని అనుకున్నాని చెప్పారు. ఆ తర్వాత సమాజ సేవలో ఉండాలన్నదే తన కోరిక అని చెప్పారు. ఈ విషయాన్ని తన భార్యకు ఎప్పుడో చెప్పానని అన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యాక ఆ కోరిక తీరే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఏ పదవిలో ఉన్నా తెలుగువారికి చేయాల్సింది చేస్తానని చెప్పారు.

తెలుగు భాషను రక్షించాలి ..

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రిలిద్దరూ కలిసే ఉండాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మనసు విప్పి మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. తెలుగులోనే మాట్లాడుకోవాలని, తెలుగుభాషను రక్షించుకోవాలని ఇరు రాష్ట్రాలకు సూచించారు. తెలుగును పరిపాలనా భాషగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు.

ఘన సన్మానం..

అంతకుముందు వెంకయ్యానాయుడికి ఘన సన్మానం జరిగింది. గవర్నర్, సీఎం పూలమాలతో వెంకయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా అభినందన సన్మాన పత్రికను, వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను ముఖ్యమంత్రి అందజేశారు. సభాపతి కోడెల శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అంతకుముందు పండితులు వెంకయ్యకు వేద ఆశీర్వచనం అందించారు.

**సేవాభావం కలిగిన వ్యక్తి వెంకయ్యానాయుడు**
**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

ఉపరాష్ట్రపతి బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా స్వరాష్ట్రానికి విచ్చేసిన వెంకయ్యానాయుడుకు విజయవాడలోని గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గవర్నర్ నరసింహన్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వాగత ర్యాలీ ప్రారంభమైంది. ప్రత్యేక వాహనంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

లక్ష మందితో 23 కి.మీ మేర ప్రకాశం బ్యారేజీ వరకు ఈ స్వాగత ర్యాలీ కొనసాగింది. అనంతరం రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపరాష్ట్రపతికి పౌర సన్మానం జరగనుంది.

ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యానాయుడు తన రాజకీయ జీవితంలో సొంత రాష్ట్రమైన ఏపీకి ఎంతో చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో తాను అలంకరించిన అన్ని పదవులకూ వన్నె తెచ్చారని కొనియాడారు. క్రమశిక్షణకు, సేవా భావానికి మారుపేరుగా నిలిచారని చెప్పారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు పౌర సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్, కేంద్రమంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి, సభాపతి కోడెల శివప్రసాదరావుతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశంలో పుట్టి మొట్టమొదటి ఉప రాష్ట్రపతి అయిన వ్యక్తి వెంకయ్య అని చంద్రబాబు కొనియాడారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న వ్యక్తి అన్నారు. తామిద్దరమూ 1978లోనే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యామని చెప్పారు. మొదటిసారి ఎన్నికైనప్పటి నుంచే ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా, రాజస్థాన్ నుంచి ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా, భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఇలా ఎన్నో పదువులు అలంకరించారని చెప్పారు.

ఏపీకి ఎంతో చేశారు ..

విభజన సందర్భంలో ఏపీ తరపున నిలబడిన ఏకైక వ్యక్తి వెంకయ్యానాయుడు అన్నారు. దేశ వ్యాప్తంగా పట్టణ గృహ నిర్మాణ పథకం కింద 26 లక్షల ఇళ్లను ఇస్తే ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే 5.29లక్షల ఇళ్లను మంజూరుకు చొరవ చూపారని చెప్పారు. ఉప రాష్ట్రపతి అయ్యే ముందు కూడా రాష్ట్రానికి 2.25లక్షల ఇళ్లను మంజూరుకు సంతకం చేశారని చెప్పారు. ఆయన నేతృత్వంలోనే రాష్ట్రానికి మూడు స్మార్ట్ సిటీలు వచ్చాయని చెప్పారు.

సమయపాలన.. సేవా భావం

ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఏ పదవిలో ఉన్నా ఆ పదవికే వన్నె తెచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగులో ఏ విధంగా మాట్లడతారో హిందీలోనూ, ఆంగ్లంలోనూ అదే స్థాయిలో అనర్గళంగా మాట్లాడగల వ్యక్తి అని కొనియాడారు. ఎప్పుడూ సమయపాలన పాటించేవారని చెప్పారు. స్వర్ణభారతి ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవలందిస్తున్నారని అన్నారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తికి అమరావతిలో సన్మానించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి వెంకయ్య అని కొనియాడారు.

## గుర్మీత్‌కు 'జడ్' కేటగిరి భద్రత రద్దు..

భద్రతాసిబ్బందిపై విరుచుకుపడ్డారు. ఈ హింసాత్మక ఘటనలో ఇప్పటి వరకు 31 మంది చనిపోగా, మరో 300 మందికి గాయాలైనట్లు తెలిసింది.

అత్యాచారం కేసులో దోషిగా తేలిన వివాదాస్పద డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను రోహ్‌తక్ జైలుకు తరలించడంతో ఆయనకు ఇంతవరకూ ఉన్న 'జడ్' కేటగిరి భద్రత రద్దయింది. ఈ విషయాన్ని హర్యానా చీఫ్ సెక్రటరీ దీపేందర్ సింగ్ శనివారం మీడియాకు తెలిపారు. జైలులో గుర్మీత్‌కు ప్రత్యేక సెల్, మినరల్ బాటిల్, ఒక అసిస్టెంట్ ఇవ్వనున్నారంటూ మీడియాలో వినిపిస్తున్న కథనాలను ఆయన కొట్టిపారేశారు. ఆయనను ఉంచినది జైలులో కానీ అతిథిగృహంలో కాదని తెలిపారు. సాధారణ ఖైదీలతో కలిసే గుర్జీత్ జైలులో గడపాల్సి ఉంటుందని, ఖైదీలకు ఇచ్చే ఆహారాన్ని ఆయనకు కూడా అందజేస్తారని చెప్పారు. ఆయనకు ఇంతవరకూ ఉన్న 'జడ్' కేటగిరి భద్రత ఆటోమాటిక్‌గానే రద్దవుతుందన్నారు. ఎలాంటి వీఐపీ ట్రీట్‌మెంట్ ఇచ్చే ప్రసక్తే లేదని, భద్రతా కారణాల రీత్యానే ఆయనను హెలికాప్టర్‌లో తీసుకువెళ్లడం జరిగిందని దీపేందర్ సింగ్ తెలిపారు.

గుర్మీత్ కళ్లలో కన్నీటి సుడులు

డేరా సచ్చా సౌధా గురువు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మాట వేదం.. ఆయన అడుగేస్తే ఓ సంచలనం.. ఎప్పుడు, ఎక్కడ ఆయన్ను చూసినా చుట్టూ భారీ భద్రతా వలయం.. ఒక్కసారి ఆయన చూపు తాకడం కోసం లక్షలాది మంది అభిమాన గణం ఎదురుచూపులు.. ఓ వీవీఐపీను పోలి ఉంటుంది ఆయన జీవితం.

ఉత్తర భారతంలో ఎంతో మంది అభిమానులను, మద్దతుదారులను కూడగట్టుకున్న ఆయన పేరు.. సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పుతో దేశవ్యాప్తంగా మారుమోగిపోతోంది. ఇద్దరు మహిళా స్వాధీలపై అత్యాచారం కేసులో ఆయన్ను శుక్రవారం సీబీఐ న్యాయస్థానం దోషిగా తేల్చింది. అత్యాచారం కేసులో ఆయనకు ఈ నెల 28న శిక్ష ఖరారు చేయనుంది.

న్యాయస్థానం తీర్పుతో డేరా చీఫ్ షాక్‌కు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం జైలుకు బయల్దేరి వెళ్లే ముందు ఆయన కళ్లలో కన్నీటి సుడులు తిరగాయి. సాధారణ బాబాలు, సాధువులతో పోల్చితే గుర్మీత్ అనుభవించిన జీవితం విభిన్నం. బాలీవుడ్ సినిమాల్లో నటించినా.. రాక్‌స్టార్‌గా మ్యూజిక్ వీడియోలు చేసినా.. అదో క్రేజ్..!. గుర్మీత్ జీవితంలోని పలు ఆసక్తికర విశేషాలు..

గుర్మీత్ అభిమానుల సంఖ్య లక్షల్లో ఉంటుంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లోని పట్టణాలు, గ్రామాల్లో ఆయనకు భారీ సంఖ్యలో మద్దతుదారులు ఉన్నారు. ఆయన కోసం ప్రాణమిచ్చేందుకు సిద్ధమని కూడా కొందరు అభిమానులు అంటూ ఉంటారు.

రాజకీయంగానూ గుర్మీత్ బలాఢ్యులే. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హరియాణాలో ఆయన భాజపాకు మద్దతు ప్రకటించారు. డేరా సచ్చా సౌధా నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రముఖ నేతలతో పాటూ హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ కట్టర్ కూడా పాల్గొన్నారు. ఇక పంజాబ్‌లో అప్పట్లో భాజపా-అకాలీదళ్ ప్రభుత్వానికి ఆయన మద్దతు ప్రకటించారు.

2008లో గుర్మీత్ లక్ష్యంగా దాడి జరిగింది. అప్పటి నుంచి ఆయన జడ్ ప్లస్ కేటగిరీ కింద సెక్యూరిటీ పొందుతున్నారు. బుల్లెట్ ప్రూఫ్ కార్లలో చక్కర్లు కొడుతున్నారు.

తొలి రోజు జైల్లో గుర్మీత్ యోగాతో తన రోజును ప్రారంభించారు. దీన్ని బట్టి ఆయనకు రోజూ యోగా చేసే అలవాటు ఉన్నట్లు తెలుస్తోంది. యోగా అనంతరం టీ, రెండు ముక్కల బ్రెడ్‌ను గుర్మీత్ ఆహారంగా తీసుకుంటారని తెలిసింది.

## బక్రీదు అనంతరం మక్కామసీదుకు మరమ్మతులు

కొనసాగుతాయన్నారు. పైకప్పు లీకేజీ మూలంగా వర్షం కురిసినప్పుడు మసీదు ఆవరణంలో నీరు చేరుతోందన్నారు. ఇటీవల మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు సయ్యద్‌ఒమ్మర్‌జలీల్, ఎ.కె.ఖాన్ తదితర అధికార బృందం సందర్శించి వెంటనే మసీదుకు చేపట్టాల్సిన మరమ్మతులను నిర్దేశించారన్నారు. 18 నెలల్లో మరమ్మతులు పూర్తవుతాయన్నారు. బక్రీదు అనంతరం పనులు ప్రారంభమవుతాయన్నారు. గురువారం చార్మినార్ ఎమ్మెల్యే సయ్యద్‌అహ్మద్‌పాషాఖాద్రీ, ఆర్కియాలాజీ అధికారుల బృందంతో కలిసి వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ సందర్శించారు. వారి వెంట మక్కామసీదు ఇమామ్ మౌలానా ఉస్మాన్, మాజీ కార్పొరేటర్ ముఖ్రంఅలీఖాన్, మసీదు మేనేజరు మన్నాన్ తదితరులున్నారు.

## గోల్డ్‌డ్రాప్ వంటనూనెకు సీఐటీడీ గుర్తింపు

గోల్డ్‌డ్రాప్ వంటనూనెలకు నాణ్యతా ప్రమాణాల అవార్డుల్లో ప్రథమ స్థానాన్ని అందించినట్టు నూనెలు తయారుచేసే లోహియా గ్రూప్ సంస్థ ఛైర్మన్ కన్నయ్యలాల్ లోహియా చెప్పారు. మాసాబ్‌ట్యాంక్‌లో గోల్కొండ హోటల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకల్లో మంచినూనె విక్రయాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణలో రెండు, కాకినాడలో ఒక నూనె తయారీ యూనిట్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. లోహియా గ్రూప్ తరపున పలు సామాజిక కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## భావితరాలకు ఉపాధి ఫలాలు

అటవీ భూములు కబ్జాకు గురవుతున్న నేపథ్యంలో ప్రజా అవసరాల కోసం పండ్ల తోటల పెంపకం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది మొదటి సారిగా అటవీ భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టామని, ఇందులో భాగంగానే మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సమీపంలోని జాతీయ రహదారి పక్కనే గల 5 ఎకరాల్లో సీతాఫలం తోటల పెంపకం చేపట్టినట్లు తెలిపారు. పండ్ల తోటల పెంపకం ద్వారా పేద ప్రజలకు జీవనోపాధితో పాటు అటవీ భూములకు రక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరించే కోతుల బెడద తగ్గుతుందన్నారు.విత్తనాలు వెదజల్లడం ద్వారా మొక్కలను పెంచచడంతో పాటు నర్సరీల ఖర్చు ఆదా అవతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1.30 కోట్ల మొక్కల పెంపకం లక్ష్యం కాగా ఇప్పటి వరకు సుమారు 75 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగతా మొక్కలను వచ్చేనెలలో పూర్తి చేస్తామన్నారు. మేడిపల్లి ఆశ్రమ పాఠశాలలో నీటి వసతితో పాటు త్రీఫేస్ విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని బాలికలు పాలనాధికారి దృష్టికి తీసుకొచ్చారు. చదువుపై అశ్రద్ధ కనబరిస్తే భవిష్యత్తు అంధకారం అవుతుందని, సౌకర్యాలు ఎలా ఉన్నాసరే పట్టుదలతో మంచిగా చదువుకొని ప్రతి ఒక్కరు మొదటి శ్రేణిలో ఉండేలా యత్నించాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎండీ అక్బర్ ఖాన్, అటవీ శాఖ రేంజ్ అధికారి రాధిక, తహసీల్దారు శ్రీనివాస చార్య, ఎంపీడీవో మల్లిఖార్జున్ రెడ్డి, జడ్పీటీసీ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సన్న బియ్యం

నర్సంపేట ఆర్డీవో రవి, తహసీల్దారు సత్యనారాయణరావు, సర్పంచి చందన, ఎంపీటీసీ సభ్యుడు సాయికుమార్, ఎంపీడీవో భాస్కర్, ఈవోపీఆర్డీ ఖాజా మైనుద్దీన్, వ్యవసాయాధికారి దయాకర్, పీహెచ్‌సీ వైద్యాధిగకారి కొమురయ్య, మండల తెరాస అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయి గైడ్స్ శిబిరానికి వర్ష

అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు. ఈ నెల 25 నుంచి ఐదు రోజులు మలేసియా దేశంలో కౌలాలంపూర్‌లో 101వ వార్షిక గార్ల్స్ గైడ్స్ ఇంటర్నేషనల్ శిబిరం జరుగనుంది. మనదేశం నుంచి ముగ్గురు శిబిరానికి ఎంపికయ్యారు. కామారెడ్డి జిల్లా, లింగంపేట మండలం, అయిలాపూర్ గ్రామానికి చెందిన కిష్టాగౌడ్ కుమార్తె కర్రె వర్షతో పాటు బెంగళూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉండటం విశేషం. లింగంపేట జిల్లా పరిషత్ హైస్కూలులో చదువుతున్న వర్ష ఏడో తరగతి నుంచి గైడ్స్ శిక్షణ తీసుకుంటున్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, తెలంగాణ పదాధికారులు పరమేశ్వర్, లక్ష్మీనారాయణ, జాన్ సామ్యూల్, భగవంతరావు, రాజగోపాల్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

## విజ్ఞానానికి పుస్తకమే పునాది

సెప్టెంబర్ ఒకటి నుంచి నిర్వహించే కరీంనగర్ బుక్ ఫెయిర్ గోడపత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన మాయాజాలంలో పడి పుస్తకాలు చదివే అలవాటుకు దూరం అవుతున్నామని చెప్పారు. ముఖ్యంగా ఈ తరం యువత, విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని, ఇందుకు తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

గణేష్ బుక్ స్టాల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటి నుంచి 11 వరకు కరీంనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వర కల్యాణ మండపంలో పుస్తక ప్రదర్శనలు ఉంటాయని, జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ పుస్తకాల పండుగను విజయవంతం చేయాలని కోరారు.

సాహితీ గౌతమి అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, కవి అన్నవరం దేవేందర్, కఫిసో అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ మాట్లాడుతూ ఈ పుస్తక పండుగలో 11 రోజుల పాటు సాహితీ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరీంనగర్‌లో తొలిసారిగా జరుగుతున్న ఈ పండుగను విజయవంతం చేయాలని కోరారు. బుక్ ఫెయిర్ నిర్వాహకులు సతీష్, మహేష్‌లు మాట్లాడుతూ రాష్ట్రం నంచి 80 స్టాల్స్ వస్తాయని, అన్ని రకాల పుస్తకాలు ఉంటాయని, వివిధ ప్రచురణ సంస్థల స్టాల్స్ కూడా ఉంటాయని, జిల్లాలోని అన్ని సాహితీ సంస్థల సహకారంతోనే ఈ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వినాయక విగ్రహాల భద్రతకు

## 18 వేల మంది పోలీసులు

చెన్నై : పలు పార్టీలకు చెందిన ప్రతినిధులు నగరంలోని 3 వేల ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతివ్వాలని నగర పోలీసు అధికారులను కోరారు. హిందూ మున్నని, హిందూ మక్కల్‌కట్చి, విశ్వహిందూ పరిషత్ వంటి పది పార్టీలు ఈ మేరకు ఓ వినతి పత్రం అందజేశాయి. నగర పోలీసు అధికారులు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 60 ప్రదేశాలలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతించారు. పోలీసులు విధించిన ఆంక్షలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుని విగ్రహాలను తొలగిస్తామని హెచ్చరించారు. హైకోర్టు పేర్కొన్న మేరకు పది అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో, కాలుష్య నియంత్రణాధికారులు పేర్కొన్న మేరకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను ఉంచరాదని స్పష్టం చేశారు. అందరూ బంకమట్టితో తయారైన విగ్రహాలనే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

## అమరుల బలిదానం వృథాగా పోనీయం

జయపురం : స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వారి బలిదానం వృథాగా పోనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి రమేష్ మాఝి పేర్కొన్నారు. పపడాహండి సమితి కేంద్రంలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద జరిగిన సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1942 ఆగస్టు 24న ఇదే రోజు స్వాతంత్ర్య పోరాటంలో 19మంది స్వాతంత్ర్య యోధులను బ్రిటీష్‌వారు కాల్చి చంపారని గుర్తు చేశారు. నాటి వారి త్యాగాలను ఎవరు మరువలేదని మంత్రి పేర్కొన్నారు. అంతకుముందు అమరుల రక్తంతో ఏరులై పారిన టురి నది వద్ద అమరులకు పిండప్రదానం చేశారు. అనంతరం మూడు మతాల ప్రముఖులచే అమరులకు నివాళు లర్పించారు.

వేదికపై అమరుల కుటుంబాలకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ హాజరుకాకపోవడం పట్ల రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుల బంధుమిత్రుల సంఘం కన్వీనరు మున్నా త్రిపాఠి తీవ్ర ఆగ్రహం వ్యక్త చేశారు.

## యోగాను పాఠ్యాంశంగా చేర్చేలా ప్రతిపాదన



కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం యోగాను పాఠ్యాంశంగా చేర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిందని ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలను స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 600 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈద శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా సాధనలో పాల్గొనడంతో శారీరక పరిరక్షణతో పాటు మానసిక వికాసం చెందడంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. యోగా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు మంచి గుర్తింపు తేవాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని ప్రపంచ స్థాయిలో రూపొందించడంలో యోగా ముఖ్య భూమిక పోషించిందన్నారు. మేయర్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు అనేక మార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచారని, మున్ముందు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు తేవాలన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావులు పాల్గొని విజేతగా నిలిచిన క్రీడాకారులకు పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. డిప్యూటీ మేయర్ రమేశ్, కార్పొరేటర్లు లింగయ్య, రవీందర్, శ్రీనివాస్, వై.సునీల్‌రావు, ఒలింపిక్ సంఘం బాధ్యులు జనార్ధన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, యోగా అసోసియేషన్ బాధ్యులు ఎన్.సిద్ధారెడ్డి, అంజనీ ప్రసాద్, కె.సంపత్, ప్రదీప్‌కుమార్, కిష్టయ్య, మైకేల్ శ్రీను, ఎస్.జి.ఎఫ్.కార్యదర్శి నర్సయ్య, స్వరూపాచారి, మల్లిక, ప్రియాంక, రమాదేవి, సుష్మా పాల్గొన్నారు.

### తలాక్‌పై న్యాయస్థానం తీర్పుపై మా ఘోరో హర్షం

సిమిలిగుడ : మూడుసార్లు తలాక్‌పై సర్వోన్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పుపై కొరాపుట్ జిల్లా మా ఘోరో సంస్థ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మా ఘోరో సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక మండపంలో మహిళలంతా పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి ఆనందం వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలకు న్యాయం జరిగేలా తలాక్‌ను రద్దు చేయడం అవసరమని, మహిళలకు గౌరవం దక్కిందని పేర్కొన్నారు. సంజుక్తా సాహు, సలహాదారులు షేక్ ఇబ్రహిమ్, అజయ్ సాహు, షహిదా తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పరిశోధనపై ప్రత్యేక దృష్టి

రాయగడ : రాష్ట్రంలో సైన్స్, అంతరిక్ష విజ్ఞానానికి సంబంధిత అంశాలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్న ఔత్సాహికుల కోసం ఒడిశా ప్రభుత్వం చొరవ చూపుతోంది. శాస్త్రీయ పరిశోధనపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మూడుచోట్ల ప్లానిటోరియంలతోపాటు అయిదుచోట్ల సైన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు నవీన్ సర్కార్ పేర్కొంది. రాజధానిలో జరిగిన ఒడిశా విజ్ఞాన అకాడమీ సన్మాన సభలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ విషయాన్ని వెల్లడించడం గమనార్హం.




ఈ సందర్భంగా మాట్లాడిన నవీన్ గోపాలపూర్, రాయ గడ, బరిపదలో ప్లానిటోరియంల ఏర్పాటుతోపాటు ఝార్సుగుడ, కేంఝర్, గోపాలపూర్, కేంద్రపడ, జయపురంలలో అయిదు సైన్స్ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పడం విశేషం. 2015, 2016లో ఒడిశా విజ్ఞాన్ అకాడమీ 28 మంది ఒడియా శాస్త్రవేత్తలను సన్మానించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పుడీ కొత్త సైన్స్ కేంద్రాలు, ప్లానిటోరియంలు సైన్స్, పరిశోధనా రంగాల్లో రాణించాలనుకుంటున్న చిన్నారులకు, ఔత్సాహికులకు ఎంతగానో దోహద పడనున్నాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## తక్షణం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

సిద్దిపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగానే ఉన్నామని చెబుతున్నా మూడేళ్లుగా ముందుకు కదలడం లేదన్నారు. తెరాస అధికారంలోకి వచ్చిన కొత్తలో రాష్ట్ర అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావడం లేదన్నారు. గిరిజనులకు 10, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచకపోతే తానే యుద్ధం చేస్తానని ప్రకటించిన కేసీఆర్ అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినప్పటికి కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ఎందుకు ప్రకటించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పురుషోత్తం, శ్రీనివాస్, కృష్ణ, ఉదయ్, మధుకర్, తదితరులు ఉన్నారు.

## పోరాటాలు చేసైనా సామాజిక న్యాయం సాధిస్తాం



ఎదులాపురం : ఐక్యంగా పోరాటాలు చేసైనా అణగారిన కులాలకు సామాజిక న్యాయం సాధిస్తామని తెలంగాణ ప్రజా, సామాజిక సంఘాల(టీమాస్) ఫోరం ఆదిలాబాద్ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. స్థానిక యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న టీమాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ నేడు దేశంలో మతోన్మాదం పెరిగిపోయి అణగారిన వర్గాలైన ఎస్టీ, ఎస్సీ, మైనారిటీల దాడులు పెచ్చుపెరిగిపోయాయని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన రిజర్వేషన్లను పాలక ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. పారిశ్రామిక రంగాలు, సేవా, ప్రభుత్వ రంగాలను సైతం ప్రభుత్వాలు ప్రైవేటుపరం చేస్తూ వారికి కొమ్ము కాస్తున్నాయని అన్నారు. దీంతో అర్హులైన వారికి ఉద్యోగవకాశాలు లేకుండా పోతున్నాయని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా కేవలం అతితక్కువగా 7 శాతం ఉన్న అగ్రకులాల వారి ప్రయోజనార్థం రాయితీల పేరిట ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపించారు.

హక్కులను కాసరా స్తూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరిని ఎండ గట్టడానికి ప్రజాసంఘాలన్నీ ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పలు ప్రజా సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. సమావేశం లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, రైతు సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు కిష్టు, దర్శనాల మల్లేష్(సీఐటీయూ), కిరణ్ (ఎస్ఎఫ్ఐ), మసీఉల్లాఖాన్(డివైఎఫ్ఐ), సచిన్ (టీఏవీఎస్), వివిధ సంఘాల నాయకులు సుగ్గం విఠల్, నదీం రాషద్(జెఐహెచ్), మయూరీఖాన్, సత్యనారాయణ, రాములు, ప్రభాకర్, అశోక్; చిక్కాల దత్తు, యాకూబ్‌బేగ్, భరత్‌వాగ్మారే, లోకారి పోషట్టి తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణతోనే న్యాయం

చిన్నశంకరంపేట: వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లారం రత్నయ్య పేర్కొన్నారు. ఆయనిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ చేస్తామని ఎన్నికల ముందు హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాలు మాట దాటవేస్తున్నాయని ఆయన విమర్శించారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు 100 రోజుల్లోగా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన భాజపా గద్దెనెక్కాక వర్గీకరణ వూసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తున్నట్లు నటిస్తూ అఖిలపక్షం నాయకులను కేంద్రం వద్దకు పంపించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. ఇరు ప్రభుత్వాలు మాదిగలను మోసం చేస్తున్నాయని వాపోయారు. గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను పటిష్టం చేసి ఉద్యమ ప్రణాళిక చేపడతామని చెప్పారు. గ్రామాల్లో డప్పు, చెప్పుల వృత్తి కార్మికులకు నెలకు రూ.2 వేలు పింఛన్ అందించాలని డిమాండు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎర్రి లింగం, జిల్లా, మండల నాయకులు లచ్చిగల్ల దేవయ్య, కొల్పుల లింగం, గుడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆహార పదార్థాల తయారీ దుకాణంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

పెనుబల్లి : మండల కేంద్రం పెనుబల్లి బీసీ కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. కాలనీలోని ఓ ఇంట్లో ఎన్.చంద్రం అనే వ్యక్తి గ్రామాల్లోని దుకాణాలకు చిన్నారులు తినే సుమారు 8 రకాల ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. అతని దుకాణంలోని ఆహార పదార్థాలను టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పరిశీలించారు. నూనెను పదేపదే వాడటంతో అది కూడ్రాయిల్ మాదిరిగా మారిందని టాస్క్‌ఫోర్స్ సీఐ సదానిరంజన్ తెలిపారు. పట్టుబడిన ఆహార పదార్థాలను సీజ్ చేసి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందించామని ఆయన వచ్చి పరిశీలించి ఈ ఆహార పదార్థాలను ల్యాబ్‌కు పంపి పరీక్షించనున్నట్లు తెలియజేశారు. దాడుల్లో గ్రామీణ సీఐ రమేశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుధీర్, జానీ, ఓంకార్, ఫయాజ్, సలీమ్ ఉన్నారు.

## అంగన్‌వాడీల్లో ఆంగ్లాన్ని ప్రారంభిస్తాం



పాలమూరు : జిల్లాలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ రొనాల్డ్‌రోస్ తెలిపారు. కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల సమన్వయకర్త రాజ్యలక్ష్మి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,889 అంగన్‌వాడీ కేంద్రాలలో రూ.1.45కోట్లతో గుడ్ల ర్యాక్‌లు, అల్మారాలు, ఇతర పరికరాలను కొనుగోలు చేసినట్లు వివరించారు.

ఇప్పటికే వంద మంది అంగన్‌వాడీలకు ఆంగ్లంలో శిక్షణ ఇప్పించామని తెలిపారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు ఇవ్వడానికి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. సమన్వయకర్త రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నిరకాల పథకాలను జిల్లాకు తీసుకు వస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ కల్మేశ్వర్ సింగెనవార్, మహిళా, శిశు, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి గోవిందరాజులు, తెరాస జిల్లా అధ్యక్షుడు శివకుమార్, నాయకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## హక్కులను పోరాడి సాధించుకోవాలి

పాల్వంచగ్రామీణం : హక్కులను పోరాడి సాధించుకోవాలని, మనకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కుల్ని పొందడం కోసం ఎన్ని ఉద్యమాలకైన సిద్ధమవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బొంకూరి పరశమేష్, గౌరవ అధ్యక్షుడు జి.మోహన్‌రావు అన్నారు. పాల్వంచలోని కుమ్రంభీం కార్యాలయంలో నియోజకవర్గ సదస్సు ఆ సంఘం మండల అధ్యక్షుడు కొడుపుగంటి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజలు వెనకబడి ఉన్నారని, 93శాతం జనాభా ఉన్నా ఉపాధి అవకాశాలు అందక అన్యాయానికి గురవుతున్నారన్నారు. 7శాతం ఉన్న అగ్రవర్ణాల ప్రజలు అన్ని రాయితీలు పొందుతూ పెత్తనం చెలాయిస్తూ, దేశ సంపదను కొల్లగొడుతున్నారన్నారు. నియోజకవర్గంలో నిర్మించిన రెండు పడకల గదులు అగ్గిపెట్టెల్ని తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. మూడెకరాలు భూములిస్తామని హామీలిచ్చి ఉన్న భూముల్ని లాక్కొంటూ దౌర్జన్యాలకు దిగడం శోచనీయమన్నారు. డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ సాధకు శత్రువులుగా ఉన్న వ్యక్తులే నేడు పదవులు అనుభవిస్తున్నారన్నారు. లగడపాటి రమేష్, ఆదివాసీ సంఘం నాయకులు సోయం సత్యనారాయణ, షేక్ అమీరుద్దీన్, ముస్లిం ఐక్యవేదిక ఇంఛార్జ్, తెలంగాణ విభిన్న వేదిక జిల్లా అధ్యక్షుడు గడపనేని సతీష్, పాయం పాపయ్య, గుర్రం లక్ష్మీ, రాసపల్లి తార, సుజాత, చల్లా వెంకన్న, షేక్ ఇమ్రాన్, రమేష్, ఎల్లయ్య, కృష్ణ పాల్గొన్నారు.

## అమరుల సాక్షిగా హక్కుల సాధనకు పోరాటం



ఇంద్రవెల్లి : జల్, జంగల్, జమీన్ కోసం పోరాడి అమరులైన ఇంద్రవెల్లి ఆదివాసీ అమరవీరుల సాక్షి వారి ఆశయాల సాధన కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తుడుందెబ్బ (ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కమిటీ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడప నగేష్ అన్నారు.

కుమురం భీం జిల్లా జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించే ఆదివాసీ హక్కుల బహిరంసభలో పాల్గొనే ముందు ద్వి చక్రవాహన ర్యాలీని ఇంద్రవెల్లి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద అమరులకు నివాళులర్పిం చారు. ఆయన మాట్లాడుతూ గిరిజనేతరులకు చట్టం ప్రకారం పహణీ పత్రాలు ఇవ్వొద్దని నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కి పహానీలు ఇస్తున్నారని ఆరోపించారు.

ఆయనతో పాటు తుడుం దెబ్బ నాయకులు తొడసం శంకర్, ఆదివాసీ అమరవీరుల ఆశయ సాధన సమితి అధ్యక్షుడు పుర్క బాపురావు, గిరిజన సంఘాల జెఏసీ మండల అధ్యక్షుడు కొట్నాక్ బారిక్‌రావు, సర్పంచి కనక జూగాధిరావు, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, నేరడిగొండ, ఆదిలాబాద్, బోథ్, బజార్‌హత్నూర్ తదితర మండలాల తుడుం దెబ్బ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు. అనంతరం ద్విచక్రవాహన ర్యాలీతో చలో జైనూర్ సభకు పయనమయ్యారు.

## సింగరేణి పాఠశాలలో స్వచ్ఛ పక్వాడ


ఇల్లెందు : ఏరియాలోని జేకే కాలనీలో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్‌ను విద్యార్థులు నిర్వహించారు. ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డితోపాటు చెత్తచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నిర్మలారాణి మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, మంచి అలవాట్లు అలవర్చుకోవడం, తరగతి గదుల చుట్టూ ఉన్న అపరిశుభ్ర వాతవారణాన్ని తొలగించడం ద్వారా అనారోగ్య సమస్యలు పునరావృతం కావాలని విద్యార్థులకు సూచించారు. హరితహారం మొక్కలను ఉత్సహంగా పాఠశాలలో నాటి సంరక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సమన్వయకర్త అంగోత్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అందరూ భాగస్వాములు కావాలి: జీఎం

ఇల్లెందు : కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో సింగరేణిలోని అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జీఎం ఏరియా అధికారులతో కలిసి నిర్వహించారు. చెత్త కుప్పల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించి పారిశుద్ధ్య పనులను చేపట్టారు. అనంతరం జీఎం మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తవని సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సూచించారు. ఈ నెల 31 వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో కొనసాగించేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ బి.వెంకటేశ్వర్లు, డీజీఎం నరసింహారావు, పీఎం లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు ఎన్.శ్రీనివాస్‌రావు, రవికుమార్, బాబుల్ రాజు, నేరుల్ల పాల్గొన్నారు.

## వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి

### ఎంబీసీ రాష్ట్ర ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్



భువనగిరి : వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని రాష్ట్ర ఎంబీసీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాయగిరిలో గల ఫంక్షన్‌హాలులో తెరాస ఆధ్వర్యంలో ఆయనకు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్య కారణంగా బీసీలు వెనుకబడ్డారని, తెలంగాణ ప్రభుత్వంలో వారికి సముచిత న్యాయం కల్పించేందుకే తన నియామకం జరిగిందన్నారు. భువనగిరి వాసిగా నా సేవల్ని గుర్తించి ఈ నియామకం జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ వారిని అభివృద్ధి పథంలో నడిపించడం ద్వారానే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, పట్టణ పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ సుర్వి లావణ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పంతులు నాయక్, పోచంపల్లి ఎంపీపీ సార సరస్వతి, తెరాస రాష్ట్ర నాయకులు గాదె నరేందర్‌రెడ్డి, నాగారం అంజయ్య, రావి సురేందర్‌రెడ్డి, కార్యక్రమ కన్వీనర్ అతికం లక్ష్మినారాయణ, మండల, పట్టణ తెరాస అధ్యక్షులు సుబ్బూరు బీరుమల్లయ్య, గోమారి సుధాకర్‌రెడ్డి, వలిగొండ జడ్పీటీసీ సభ్యుడు మొగుళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కార్పొరేట్ వైద్యం



భువనగిరి : పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి టౌన్, వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో నూతనంగా రూ.44లక్షల వ్యయంతో హోమియో ఆస్పత్రిని, రూ.50లక్షల వ్యయంతో ప్రాంతీయ ఆస్పత్రిలో ప్రసూతి విభాగానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు వైద్య రంగాన్ని విస్మరించాయని అన్నారు. తెరాస ప్రభుత్వం సర్కార్ దవాఖానాల్లో వసతుల కల్పన, సేవలు మెరుగుపర్చేందుకు కోటాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో 90 కాన్పులు జరిగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం ఈ సంఖ్య 250కి దాటిందన్నారు. వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగు పడిందన్నారు. ఒత్తిడి ఉన్నప్పటికీ వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలను ప్రజలు గుర్తించి సహకరించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడతూ రోగుల సంఖ్య పెరుగుతున్నందున ఆస్పత్రిలో విస్తరణ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదనపు నిర్మాణాలతోపాటు సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ అనితారామచంద్రన్ మాట్లాడుతూ సేవలు పెరిగినందున ఆస్పత్రిలో పలు విభాగాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. నిర్మాణాలు లేనికారణంగా కొన్ని సేవలు అందించడంలో జాప్యం జరుగుతుందని త్వరలోనే డయాలసిస్, ఐసీయూ విభాగాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నా మన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం తరలింపును ఆలోచిస్తున్నామన్నారు. కార్యాలయం తరలింపుతో కొంతమేరకు వసతి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, పుర అధ్యక్షురాలు సుర్వి లావణ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోట్యానాయక్, హోమియో ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ, వార్డు కౌన్సిలర్ రఘునాథ్, తెరాస మండల, పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పార్టీకి నష్టం చేకూర్చితే వేటు తప్పదు

### రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సంస్థ ఛైర్మన్ లోక భూమారెడ్డి



ఆదిలాబాద్ : పార్టీలోనే ఉంటూ పార్టీకి నష్టం చేకూర్చితే వారు ఎంతటి వారైనా క్రమశిక్షణ చర్యలు తప్పవని తెరాస జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సంస్థ ఛైర్మన్ లోక భూమారెడ్డి స్పష్టం చేశారు. విభేదాలు ఉన్న చోట నేతలను సమన్వయపరుస్తున్నామని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భోథ్ నియోజకవర్గంలో సొంత పార్టీకి చెందిన ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే వర్గీయులు బాహటంగానే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న విషయాన్ని ప్రశ్నించగా ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గంలో విభేదాలపై స్పందిస్తూ ఎమ్మెల్యే రేఖానాయక్, ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎంపీ రాఠోడ్ రమేష్ మధ్య సమన్వయం లేని మాట వాస్తవమేనని అంగీకరించారు. ఇద్దరిని మంత్రి హరిష్‌రావు ప్రత్యేకంగా పిలిపించి నచ్చజెప్పారని పేర్కొన్నారు. ఆచార్య కోదండరాం తరచూ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ఉద్యమ సమయంలో పోరాటంలో పాల్గొన్న ఆయన్ని కీర్తిస్తూ వచ్చామన్నారు. కానీ కొంతకాలంగా ఆయన ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను చూస్తే కాంగ్రెస్ ఏజెంటుగా మారారని అనుమానం వస్తోందని తెలిపారు. తెలంగాణకు అడుగడుగునా అడ్డుపడి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించి తెదేపా, కాంగ్రెస్‌లకు ఆయన అనుకూలంగా వ్యవహరిస్తుండడాన్ని బట్టి చూస్తే ఏదైనా ప్రలోభాలకు లొంగారా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయనికి పెద్దపీట వేస్తూ రైతులకు ప్రయోజనం చేకూర్చినందుకే సీఎంకు జాతీయ స్థాయిలో పురస్కారం లభించిందన్నారు. కాళేశ్వరం వద్ద ముంపు భూములు ఇచ్చేందుకు 90 శాతం రైతులు సముఖంగా ఉంటే అనుకూలంగా లేని 10 శాతం మంది రైతుల పక్షాన కాంగ్రెస్ నాయకులు కావాలని విమర్శలు చేస్తే కోదండరాం దానికి మద్దతు తెలపడం విడ్డూరమన్నారు.దీనిబట్టి ఆయన కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోందన్నారు. సమావేశంలో పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి విజ్జగిరి నారాయణ, ఇమామ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### రగులుతున్న డోక్లామ్..

చైనాతో డోక్లామ్ వివాదం రగులుతున్న నేపథ్యంలో నేపాల్ ప్రధాని షేర్ బహదుర్ దేవుబా భారత పర్యటనకు రావడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం హర్షణీయమైన పరిణామం. ఊహించిన రీతిలోనే దేవుబాకు ఘనస్వాగతం లభించింది. ప్రధాని నరేంద్ర మోదీ, దేవుబా మధ్య సమగ్ర చర్చలు సాగడంతో పాటు రెండు దేశాల మధ్య ఎనిమిది ఒప్పందాలపై సంతకా లు జరిగాయి. సందర్భానుసారం ప్రాంతీయ సంబంధాలు, వ్యూహాత్మక అంశాలు చర్చకు వచ్చాయి. దేవుబా ఉన్నతస్థాయి వ్యాపార బృందంతో తరలివచ్చారు కనుక వాణిజ్యం ప్రధానాంశమైంది. సరిహద్దు మీదుగా సాగే రెండు విద్యుత్ లైన్స్‌ను ఇరువురు ప్రధానులు ఉమ్మడి గా ప్రారంభించారు. నేపాల్ సర్వతోముఖాభివృద్ధికి భారత్ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ ఉమ్మడి పత్రికా సమావేశంలో హామీ ఇచ్చారు. నేపాల్ భారత వ్యతిరేక కార్యకలాపాలకు వేదిక కాబోదని నేపాల్ ప్రధాని దేవుబా హామీ ఇచ్చారు. నేపాల్ అభివృద్ధిలో భాగస్వామి కావడం భారత్ అదృష్టమనీ, ఇంధనం, జలవనరులు తదితర రంగాలలో ప్రాజెక్టుల కోసం రెండు దేశా లు ఉమ్మడి కృషి సాగిస్తున్నాయని ప్రధాని మోదీ వివరించారు. నేపాల్‌లో భారత్ చేపట్టే జలవిద్యుత్ కేంద్రానికి (అరుణ్ 3) భూమిని సమకూర్చినట్టు వెల్లడించిన దేవుబా, ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావాలని ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఇటీవలి వరకు రెండు దేశాల మధ్య ఉద్రిక్త సంబంధాలే ఉన్నాయి. హఠాత్తుగా ఈ ఇచ్చికోవడం, పుచ్చుకోవడం సాగడం వెనుక డోక్లామ్ వివాద నేపథ్యం ఉన్నది. నేపాల్‌తో సత్సంబంధాల విషయంలో భారత్ అప్రమత్తమైందని తెలుస్తూనే ఉన్నది. డోక్లామ్ వివాదం తలెత్తగానే భూటాన్ యథావిధిగా భారత్ అనుకూల వైఖరి తీసుకున్నది. కానీ నేపాల్ ఇందుకు భిన్నంగా తాము తటస్థంగా ఉంటామని ప్రకటించింది. నేపాల్ విదేశాం గ మంత్రి కృష్ణ బహదూర్ మహరా తమ తటస్థ వైఖరిని పదిహేను రోజుల కిందట స్పష్టం చేశారు. (భారత్- చైనా) సరిహద్దు వివాదంలో నేపాల్‌ను ఈ వైపు లేదా ఆ వైపు లాగడం జరుగదు. భారత్, చైనా శాంతియుతంగా దౌత్య మార్గాల ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవాలని నేపాల్ కోరుకుంటున్నది అని ఆయన వివరించారు. డోక్లామ్ వివాదం తలెత్తిన తరువాత ఢిల్లీలోని చైనా రాయబారి స్వయంగా నేపాల్ రాయబార కార్యాలయానికి వెళ్ళి మంతనాలు జరిపారు. నేపాల్ తటస్థ దేశం శాంతియుత పరిష్కారాన్ని కోరుతున్నది అంటూ ఢిల్లీలోని నేపాల్ రాయబారి దీప్ కుమార్ భారత్ అనుకూల వైఖరి తీసుకోవడం లేదని స్పష్టంగానే చెప్పారు. డోక్లామ్ గొడవ సాగుతుండగానే చైనా ఉప ప్రధాని వాంగ్ యాంగ్ పాకిస్థాన్‌లో స్వాతం త్ర్య వేడుకలకు హాజరై అక్కడి నుంచి నేపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా నేపాల్‌తో ఇంధనంతో పాటు అనేక రంగాలలో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వచ్చే అక్టోబరులో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ నేపాల్ పర్యటిస్తున్నారు. నేపాల్‌ను తటస్థం గా మార్చడంలో చైనా విజయవంతమైందనేది స్పష్టం. డోక్లామ్ ప్రాంతంలో భారత్‌పై ఎదురు సవాళ్లు విసురుతున్న చైనా తాము కశ్మీర్‌లో, కాలాపానీలో ప్రవేశిస్తే ఎట్లా ఉంటుందని హెచ్చరించిం ది. డోక్లామ్ చైనా, భారత్, భూటాన్ దేశాల కూడలిలో ఉన్నది. ఇదే విధంగా కశ్మీర్ భారత్, చైనా, పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రాంతం. కాలాపానీ భారత్, చైనా, నేపాల్ కూడలి. చైనా బెదిరింపుల నేపథ్యంలో భారత్‌కు నేపాల్‌తో ఉద్రిక్తతలను సడలించుకోవలసిన తక్షణ అవసరం ఏర్పడ్డది. ఈ నేపథ్యంలోనే దేవుబా భారత్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడ్డది. నేపాల్‌లో ఎవరు అధికారం చేపట్టినా తమ మొదటి పర్యటనగా భారత్‌ను సందర్శిస్తారు. దేవుబా కూడా మొదటి విదేశీ పర్యటనగా ఢిల్లీలో అడుగు పెట్టారు. కానీ జూన్‌లో అధికారం చేపట్టిన దేవుబా ఢిల్లీ రావడానికి ముందే, నేపాల్‌తో ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకోవడంలో చైనా వేగంగా పావులు కదిపింది. భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తత చైనాకు అనుకూలంగా కలిసివచ్చింది. నేపాల్‌లో మధేసి ఆందోళన మూలంగా 2015 సెప్టెంబరు నుంచి 2016 ఫిబ్ర వరి వరకు ఆ దేశానికి భారత్ నుంచి రవాణా సదుపాయాలు నిలిచిపోయాయి. మందులు, వంటగ్యాస్ మొదలుకొని అనేక వస్తువులకు కొరత ఏర్పడటంతో భారత్ వ్యతిరేకత ప్రబలింది. పథకం ప్రకారం భారత్ తమపై ఒత్తిడి తెస్తున్నదనే అభిప్రాయం నేపాలీలకు ఏర్పడ్డది. దీనిని చైనా అనుకూలంగా మలుచుకున్నది. పెద్ద ఎత్తున నిత్యావసర వస్తువులు సరఫరా చేసింది. రవాణా కోసం దాదాపు ముప్ఫై మార్గాలను తెరిచింది. గత ఏడాది నేపాల్‌కు రుణ సహాయం అందించిన దేశాలలో చైనా భారత్‌ను అధిగమించింది. వన్ బెల్ట్ వన్ రోడ్ సమావేశాన్ని భార త్ బహిష్కరిస్తే, నేపాల్ మాత్రం హాజరైంది. చైనా ఒక్క నేపాల్‌తోనే కాదు, భారత్ పొరుగు దేశాలన్నిటితోనూ సాన్నిహిత్యం పెంచుకుంటూ తన ప్రాబల్యాన్ని విస్తరించుకుంటున్నది.

## సిరీస్‌పై కన్నేసిన టీమిండియా



పల్లెకెలె: తొలి రెండు వన్డేల్లో విజయాలతో జోరు మీదున్న విరాట్ కోహ్లి నేతృత్వంలోని టీమిండియా సిరీస్ పై కన్నేసింది. హ్యాట్రిక్ విజయాలు సాధించి ఇంకా రెండు వన్డేలు మిగిలి ఉండగానే సిరీస్ ను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఐదు వన్డేల సిరీస్ లో భాగంగా మొదటి వన్డేలో ఘన విజయం సాధించిన భారత్.. రెండో వన్డేలో పోరాడి గెలిచింది. దాంతో సిరీస్ లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఈ క్రమంలోనే ఆదివారం పల్లెకెలె వేదికగా జరుగుతున్న మూడో వన్డేలోనూ విజయం సాధించి సిరీస్ ను కైవసం చేసుకునేందుకు భారత్ కసరత్తు చేస్తోంది. ఇక్కడే జరిగిన రెండో వన్డేలో ఓటమి అంచుల వరకూ వెళ్లి గట్టెక్కిన విరాట్ సేన.. ఈసారి ఎటువంటి ఉదాసీనతకు తావివ్వకూడదనే యోచనలో ఉంది. రేపు మధ్యాహ్నం గం.2.30 ని.లకు ఇరు జట్ల మధ్య మూడో వన్డే జరుగనుంది.

ఒకవైపు సిరీస్ కోసం భారత్ తపిస్తుంటే, మరొకవైపు లంకేయులి పరువు దక్కించుకోవాలని చూస్తున్నారు. ఇరు జట్ల మధ్య జరుగుతున్న ఓవరాల్ ద్వైపాక్షిక సిరీస్ లో ఇప్పటివరకూ శ్రీలంక బోణి కొట్టలేదు. దాంతో కనీసం ఒక్క మ్యాచ్ ను గెలిచి గౌరవం కాపాడుకోవాలనే యోచనలో లంక ఉంది. కాగా, శ్రీలంక రెండు వన్డేల్లో విజయం సాధిస్తే నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది. ఈ నేపథ్యంలో భారత్ ను నిలువరించేందుకు లంక జట్టు శాయశక్తులా ఒడ్డుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

**ఇది మూడోది మాత్రమే..**

ఈ స్టేడియంలో భారత్-శ్రీలంక జట్ల మధ్య పెద్దగా వన్డేలు జరగలేదు. మొన్న జరిగిన రెండో వన్డే ఒకటైతే, అంతకుముందు ఒక వన్డే మ్యాచ్ మాత్రమే ఇక్కడ భారత్ ఆడింది. 2012లో పల్లెకెలెలో శ్రీలంకతో ఆడిన తన మొదటి వన్డే మ్యాచ్ లో భారత్ 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ తరువాత గత గురువారం జరిగిన మ్యాచ్ లో భారత్ మూడు వికెట్లతో గెలుపొందింది. రేపటి మ్యాచ్ లో భారత్ గెలిస్తే ఇక్కడ హ్యాట్రిక్ విజయాల్ని సాధించడమే కాకుండా, సిరీస్ ను కూడా దక్కుతుంది.

## సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్



ఇస్లామాబాద్: పనామా ఆరోపణలు, ఆపై సుప్రీంకోర్టు తీర్పుననుసరించి పాకిస్థాన్ ప్రధాని గద్దె నుంచి నవాజ్ షరీఫ్ ప్రస్తుతం ప్రజా మద్దతును కూడగట్టే పనిలో ఉన్నారు. దేశవ్యాప్తంగా ర్యాలీలు, సభలు నిర్వహిస్తూ తనపై వచ్చినవన్నీ ఆరోపణలేనని చెప్పుకొస్తున్నారు . ఇక ఆయన కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టు అనర్హత వేటు తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ ఓ పిటిషన్ దాఖలు చేశారు.

షరీఫ్ తరపున ఆయన కూతురు మర్యమ్ నవాజ్, తనయులు హుస్సేన్ నవాజ్ మరియు హస్సన్ నవాజ్, అల్లుడు కెప్టెన్ సఫ్దార్‌లు పిటిషనర్లుగా పేర్కొంటూ న్యాయవాది సల్మాన్ అక్రమ్ రాజా రివ్యూ పిటిషన్‌ను ఫైల్ చేశారు. అక్రమ ఆరోపణలపై విచారణ అంశం అసలు కోర్టు పరిధిలోకే రాదంటూ వాళ్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.

దుబాయ్ కంపెనీలకు చెందిన ఆదాయాన్ని 2013 ఎన్నికల సమయంలోని నామినేషన్ పేపర్లలో షరీఫ్ పేర్కొనలేదంటూ పనామా పేపర్ల లీకేజీతో వెలుగులోకి రాగా, ఆ ఆరోపణలపై విచారణ చేపట్టిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆయన దోషిగా ప్రకటించి ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

పాక్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 62(1)(ఫ్) ప్రకారం ఆయనపై అనర్హత వేటు వేస్తూ జూలై 28న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేయగా, ఆయన కుటుంబ సభ్యులు ఇప్పుడు రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు.

## బంగారం దిగుమతులు బ్యాన్



న్యూఢిల్లీ : దక్షిణ కొరియా నుంచి విపరీతంగా బంగారం, వెండి దిగుమతులు పెరుగుతుండటంతో, వీటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ ఉత్పత్తులను నియంత్రిత కేటగిరీలోకి చేర్చింది. దీంతో బంగారం, వెండిని దిగుమతి చేసుకోవాలంటే దిగుమతిదారులు ముందస్తుగా ప్రభుత్వం వద్ద నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు మధ్య కాలంలో దక్షిణ కొరియా నుంచి 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన బంగారం దిగుమతులు చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాయిన్లు, ఆభరణాల రూపంలో అన్ని రకాల బంగారం, వెండి ఉత్పత్తులపై ఈ పరిమితి విధిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

బేసిక్ కస్టమ్ డ్యూటీ లేకుండా దక్షిణ కొరియాకు, భారత్‌కు మధ్య ఉచిత వాణిజ్య ట్రేడ్ జరుగుతోంది. ఉచిత వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ఉత్పత్తులపై 10 శాతం కస్టమ్ డ్యూటీ ఉంది. చైనా తర్వాత ప్రపంచంలో అతిపెద్ద బంగారం వినియోగదారునిగా భారత్ ఉంది. ప్రస్తుతం 400 ప్లస్ ఉత్పత్తులు నియంత్రిత దిగుమతుల జాబితాలో ఉన్నాయి. వాటిలో జంతువులు, కొన్ని విత్తనాలు, యూరేనియం, పేలుడు పదార్థాలున్నాయి. డబ్ల్యూటీఓ నిబంధనలకు అనుగుణంగానే ఈ నిషేధం ఉందని, ఎఫ్‌టీఏ నిబంధనలను ఇది ఉల్లంఘించడం లేదని అధికారులు పేర్కొన్నారు. జూలైలో బంగారం దిగుమతులు 95 శాతం పెరిగాయి.

## కశ్మీర్‌లో ఉగ్రదాడి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో తెల్లవారుజామున ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పుల్వామాలో పోలీసు లైన్ల వద్ద కాపలాగా ఉన్న భద్రతా సిబ్బందిపై మెరుపు దాడికి దిగారు. ఈ ఘటనలో ఆరుగురు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు, మరో ఇద్దరు పోలీసులు ఉన్నారు.

ఆసుపత్రిలో ఓ జవాన్ అమరుడయ్యారు. ఈ ఘటన అనంతరం ఉగ్రవాదుల కోసం ఆ ప్రాంతంలో భద్రతాసిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

## సమకవియం

### 'గుంటూరు గుంటడు'

ఒ(ర, ఒ(ర గున్నడు
చీమ మిరపకాయ లా గున్నడు
వళ్లు విరుస్తున్నడు
గుంటూరు గుంటడు
ఏ గోతిలో పడ్డడో!
చదువు కొమ్మని కాలేజికి పంపిస్తే;
చదువు పిచ్చ లేకుండా!
పిట్టలను వలవేస్తుంటడు.
విజల్ వేస్తుంటడు
కన్ను కొట్టి, కొంటి చేష్టలు చేస్తుంటాడు ...॥ఒ(ర॥
గుంట కన్పిస్తే గుద్దుకొని వెల్తడు
ఎనెన్ని ట్రిక్కులు ప్లే చేస్తూ;
ఒళ్లు తగలాలని చూస్తడు
అమ్మవారి గుడియైనా!
దేవుడి గుడియైనా! లెక్కచెయ్యిడు
అదే ధ్యాసలో ఉంటడు
పెద్దలు ప్రక్కనున్నా!
భయభక్తులుండవు ...॥ఒ(ర॥
అలాంటోడికి;
పెళ్లైన మరుచటి రోజే; అధిక
ఆషాడం తగులుకుంటే ఉంటది... ఉంటది
అలాంటోడికి;
అత్తోరికి చెప్పకుండా కన్నోరింటికి
కన్నోరికి చెప్పకుండా అత్తోరింటికి
తిరుగులు మరుగులు చేసే పిచ్చ పెళ్లం
తగులుకుంటే ఉంటది... ఉంటది
అలాంటోడికి;
పెళ్లమని చెయ్యివేస్తే;
లింగి పట్టి లాగి లంగడి చేస్తే ఉంటది... ఉంటది
గృహ హింస చేస్తున్నడని
జైల్‌లో పెట్టె ఉంటది... ఉంటది ...॥ఒ(ర॥

...కవితా రచన
యల్.సిద్ధూ
సెల్ నెం: 7702977293

## పంచాంగం

మాసం : భాద్రపద; తిథి: షష్ఠి రా.11.07; స్వాతి రా.7.21; రా.వ.1.25ల 3.09


ఆదివారం 27-08-2017

**మేషం** : ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. గతంలో మిమ్ములను విమర్శించిన వారే మీ సహాయం అర్థిస్తారు. **వృషభం** : వృత్తి పరమైన ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. దంపతుల మధ్య సఖ్యతాలోపం, కలహాలు చోటు చేసు కుంటాయి. కొన్ని విషయాల్లో మీరెంత తెలివిగా వ్యవహ రించినా ఫలితాలు భిన్నంగానే ఉంటాయి. **మిథునం** : తలపెట్టిన పనులు వేగ వంతమవుతాయి. విదేశీ యత్నాలు వాయిదాపడతాయి. బ్యాంక్ వ్యవహా రాలలో మెళకవ వహించండి. **కర్కాటకం** : ఉద్యోగస్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారిస్తారు. ఆలయా లను సందర్శిస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనా నిరుత్సాహపరుస్తాయి. ఏ విషయంలోను హామీ ఇవ్వకుండా లౌక్యంగా దాట వేయండి. **సింహం** : ప్రయాణ లాభం, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. శుభకార్యాలపై దృష్టి పెడతారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. రుణాలు చేస్తారు. పెండింగ్ వ్యవహారాలు పూర్తి చేస్తారు. **కన్య** : విందు, వినోదాలు, దూర ప్రయాణాలు చేస్తారు. కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లు విజయం సాధిస్తారు. మీ శ్రీమతి సహాయం లేనిదే మీ సమస్యలు పరిష్కారం కావని గ్రహించండి. ఇతరుల మెప్పుకోసం శ్రమాధిక్యత, ఒత్తిడి ఎదుర్కొనవలసివస్తుంది. **తుల** : రవాణా రంగాలలోని వారికి చికాకులు తప్పవు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. పెట్టుబడుల విషయంలో పునరాలోచన చాలా అవసరం. **వృశ్చికం** :వ్యాపారాల్లో నిలదొక్కు కోవటానికి మరింతగా శ్రమించ వలసి ఉంటుంది. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు, వైద్యులకు అనుకూలత. **ధనుస్సు** : విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. **మకరం** : నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు. **కుంభం** : వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు కలుగును. అయినవారితో ఉల్లా సంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. **మీనం** : విందు వినోద కార్య క్రమాల్లో పాల్గొంటారు. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమదాయకం.

## శేషశయనా... అనంత పద్మనాభ

సంకీర్తన





శ్రీ మహావిష్ణువు 108 దివ్యదేశాల్లో అత్యంత ముఖ్యమైన క్షేత్రం తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం. పాలకడలిలో శేషపాన్పుపై పవళించిన ఆ చిద్విలాసమూర్తి మహారూపాన్ని ఇక్కడ వీక్షించవచ్చు. పద్మాన్ని నాభి యందు కలిగిన వాడు కాబట్టే ఆ పురుషోత్తముడిని పద్మనాభుడిగా పిలుస్తాం. శ్రీఅనంత పద్మనాభస్వామి ఆలయంలో వెలువడిన సంపద యావత్ ప్రపంచదృష్టిని ఆకర్షించింది. లక్షల కోట్లు విలువచేసే సంపదతో స్వామివారు ప్రపంచంలోనే అత్యంత ఐశ్వర్యమూర్తిగా అవత రించారు. అనంతమంటే అంతు లేనిదని అర్థం. అంత సంపదను వందల సంవత్స రాలుగా ఆలయంలో నిక్షిప్తం చేసుకున్న ఆ స్వామి నిజంగా అనంతుడే. లోకంలో సంభవించే విపత్తులను అడ్డుకునేందుకు ఆ పరంధాముడు పలు అవతారాలు ఎత్తి శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేశాడు. ఆర్తితో పిలిస్తే భక్తులను ఆదుకుంటారు. అనంతమైన ఆ పరమాత్ముడు స్వయంగా వెలసిన క్షేత్రమే శ్రీఅనంత పద్మనాభక్షేత్రం.

స్వామిని పూజించిన బలరాముడు

ఈ ఆలయ ప్రస్తావన పలు పురాణాల్లో, ఇతిహాసాల్లో వుంది. బలరాముడు ఆలయాన్ని సందర్శించి పూజలు చేసినట్టు శ్రీమద్ భాగవతం తెలుపుతోంది. స్వామివారి మహత్యాన్ని పేర్కొంటూ 12 మంది ఆళ్వా రుల్లో ఒకరైన నమ్మాళ్వారు అనేక రచనలు చేశారు. కలియుగం ప్రారంభమైన రోజున ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. అయితే ఈ ఆలయ చరిత్రపై కచ్చితమైన సమాచారం లేదు. వేల సంవత్స రాల నుంచి ఆలయం నిత్యపూజలు అందు కున్నట్టు ఆలయానికి చెందిన రికార్డులు వెల్లడిస్తున్నాయి.

అనంతశయన మహత్య

అనంతపద్మనాభుడు ఎలా ప్రత్యక్షమయ్యాడు అన్న దానిపై అనంతశయన మహత్య గ్రంథం వివరాలను తెలుపుతోంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం దివాకరముని అనే విష? భక్తుడు వుండేవాడు. నిత్యం విష్ణునామ సంకీర్తనతో ఆయన నిమగ్నమయి వుండేవాడు. ఒకరోజు భగవానుడు ఆయనకు బాలుని రూపంలో ప్రత్యక్షమయ్యాడు. ముద్దులొలికే ఆ పిల్లవాడిని చూసిన దివాకరుడు తన నివాసంలో వుండాలని కోరాడు. అయితే ఆ పిల్లవాడు సాక్షాత్తు పరమాత్ముడే అన్న అంశాన్ని ముని గుర్తించలేకపోయారు. దీనిపై స్పందించిన చిన్నారి తాను చేసే పనులకు ఎలాంటి అడ్డుచెప్పకూడదని ఒకవేళ చెబితే వెళ్లిపోతానని నిబంధన పెడుతాడు. కొన్నిరోజులకు పిల్లవాడు చేసే అల్లరి ఎక్కువయింది. ఒకనాడు ముని తపోదీక్షలో వుండగా సాలగ్రామాలను తీసుకువచ్చిన స్వామి అతని నోటిలో వేస్తాడు. దీంతో మునికి తపోభంగమైంది. పిల్లవాడిపై పట్టరాని కోపం ప్రదర్శిస్తాడు. పిల్లవాడు వెంటనే అద ృశ్యమవుతూ తనను తిరిగి చూడాలంటే అనంతన్‌కాడు దగ్గరకు రమ్మని చెబుతాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే తన నివాసంలో బాలుడిగా వున్న అంశాన్ని దివాకరముని గుర్తిస్తాడు. వెంటనే స్వామిని అన్వేషిస్తూ సముద్రతీరప్రాంతానికి చేరుకుంటాడు. అక్కడ వున్న భారీ వ ృక్షం నేలపై పడి శ్రీమహావిషు?వుగా రూపాంతరం చెందింది. స్వామివారు భారీ రూపంగా దర్శనమిచ్చారు. అనంతుని దర్శనంతో అమితానందం చెందిన దివాకరముని అంతటి పెద్ద రూపాన్ని వీక్షించలేనని ప్రార్థించడంతో యోగదండం కంటే మూడింతలు పెద్దగా మారిపోయారు. స్వామిని కనులారా వీక్షించిన ముని స్వామికి ఒక టెంకాయలో మామిడికాయను వుంచి ప్రసాదంగా ఇస్తారు. ఇప్పటికీ ఈ పూజా విధానం ఆలయంలో కొనసాగుతుండటం విశేషం. ఈ క్షేత్రానికి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యంలో వుంది. నంబూద్రి సన్యాసి వివమంగళ స్వామియార్ అనే విష్ణు భక్తుడికి కూడా అనంతుడు ఇలానే దర్శనమిచ్చినట్టు తెలుస్తోంది.

**మూలవిరాట్టును మూడు ద్వారాల్లో నుంచి దర్శించాలి**

స్వామివారి మూలవిరాట్టును ఒక ద్వారం నుంచి మనం వీక్షించలేం. పెద్ద విగ్రహం కావడంతో తలను, చేతిని, పాదాలను వేర్వేరు ద్వారాల నుంచి వీక్షించాలి. రాజా మార్తాండవర్మ పాలనా సమయంలో వేల సాలగ్రామాలతో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆ రోజుల్లో 4వేల శిల్పకారులు, 6వేలమంది కార్మికులు, నూరు ఏనుగులు ఆరు నెలల పాటు శ్రమించి ఆలయంలోని పలు కళాకృతులను ఏర్పాటుచేసినట్టు తెలుస్తోంది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# పహాణీల పంపిణీని నిరసిస్తూ జైనూరులో భారీ ర్యాలీ



జైనూరు : ఆదిమజాతుల మనుగడ కోసం ఇక చావైనా.. బతుకైనా సమాజం అంతా ఏకతాటిపైకి వచ్చి ప్రాణత్యాగాలకు సిద్ధం కావాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే సోయం బాపురావు అన్నారు. రాజ్యాంగబద్ధంగా ఆదిమజాతులకు రక్షణ కవచంగా అమలు చేసిన చట్టాలను తుంగలో తొక్కి జాతికి తీరని అన్యాయం చేస్తున్న పాలకులు, అధికారులపై తిరగబడాల్సిన అవసరముందంటూ ఆదివాసీలంతా కదం తొక్కారు. ఏజెన్సీలో గిరిజనేతరులకు పహాణీల పంపిణీకి వ్యతిరేకంగా గిరిజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల గిరిజనులు జైనూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ డోలు, సన్నాయిలు, కాలికోమ్ వాయిస్తూ.. తుడుం మోగించారు. మార్కెట్ యార్డు నుంచి ప్రధాన రహదారి గుండా తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శంకర్‌గౌడుకు వినతపత్రం ఇచ్చారు. 1/70, పీసా చట్టం అమలు ఉండగా ఏజెన్సీలో గిరిజనేతరులకు ఏ అధికారంతో పహాణీలు పంపిణీ చేశారని ప్రశ్నించారు. తక్షణమే పహాణీలు నిలిపివేయాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పహాణీలు పంపిణీ చేయాలని

### తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బాపురావు

ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా పాలనాధికారి చంపాలాల్, తహసీల్దార్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఠాణా ఎదుట బైఠాయించారు. సీఐ నాగేంద్రగౌడుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సోయం బాపురావు మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ గిరిజనేతరులు, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తే ఆదివాసీ సమాజం చూస్తూ వూరుకోమన్నారు. ఆదివాసీలకు జిల్లా పాలనాధికారి చంపాలాల్, ఎమ్మెల్యే కోవలక్ష్మి క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో గ్రామాల్లో తిరగన్వీమని హెచ్చరించారు. ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక్ విజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం గోపిచంద్, ఆదివాసీ సంక్షేమ పరిషత్తు జిల్లా గౌరవ అధ్యక్షుడు మెస్రం శేఖు, కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం శంకర్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, కుమురంభీం, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల తుడుందెబ్బ అధ్యక్షులు కోట్నాక్ విజయ్, కోట్నాక్ తెలంగారావు, కుడ్మెత తిరుపతి, ఆత్రం తిరుపతి, అ.వి.సం జిల్లా అధ్యక్షుడు సోయం మారుతి, ఇంద్రవెల్లి స్తూపం అధ్యక్షుడు పుర్క బాపురావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, జిల్లా మహిళ ప్రతినిధి ఆత్రం సుగుణ, తెలంగాణ రైతు సంఘం సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయన్న, గిరిజన సంఘాల నాయకులు పెందూర్ శంకర్, కుడ్మెత మధు, కోట్నాక్ గణపతి, కబీర్‌దాస్, కోట్నాక్ బారిక్‌రావు, కనక అంబాజీరావు, పెందూర్ రాజేశ్వర్, ఉమ్మడి జిల్లాల ఆదివాసీలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ నాగేంద్రగౌడ్ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తులో సిర్పూరు(యు), కెరమెరి, లింగాపూర్ ఎస్ఐలు రామారావు, సత్యనారాయణ, ఏఎస్ఐ జాధవ్ రాంధన్‌లు పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఆదిలాబాద్ : గణేశ్ నవరాత్రులను పురస్కరించుకొని విధులకు హాజరయ్యే పోలీసులు ఆదిలాబాద్ పట్టణలో కవాతు నిర్వహించారు. పట్టణ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించిన అనంతరం కేటాయించిన చోట్ల విధులకు హాజరయ్యేందుకు బయలుదేరారు. పట్టణంలోని కుర్షీద్‌నగర్, భాగ్యనగర్, తాటిగూడ, అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, చంచర్‌వాడ, జమామసీదు, అశోక్‌రోడ్, మసూద్‌చౌక్, వినాయక్ చౌక్, బొక్కలగూడ, శాంతినగర్ నుంచి మావాల పరిధిలోని దస్నాపూర్, రాంనగర్, సుభాష్ నగర్, కేఆర్‌కే కాలనీల గుండా కవాతు కొనసాగింది. కార్యక్రమంలో సీఐలు స్వామి, సురేశ్, ఎస్సైలు రాజు, వెంకటేశ్, సాయుధ పోలీసులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై పుల్లయ్య సూచించారు. గురువారం జైనథ్ గ్రామ పంచాయతీ ఆవరణలో మత పెద్దలు, గ్రామ పెద్దలు, యువకులు, మండపాల నిర్వాహకులకు ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత సామరస్యం వెల్లివిరిసేలా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల్లో విద్యుత్తు ఏర్పాటుకు సంబంధిత అధికారులను సంప్రదించాలని అన్నారు. రాజకీయ పార్టీ గురించి ప్రసంగాలు, నినాదాలు చేయకూడదని పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నియమ నిబంధనల గురించి నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి గణేష్‌యాదవ్, మార్కెట్ డైరెక్టర్ పూంద్రు వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ కొడిచెర్ల లస్మన్న, అల్లూరి అశోక్‌రెడ్డి, దుమాల స్వామి పాల్గొన్నారు.

## ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం



చిన్నశంకరంపేట: గ్రామ సేవకులు (వీఆర్‌ఏలు) ఐక్యంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి పేర్కొన్నారు. చిన్నశంకరంపేట రెవెన్యూ కార్యాలయం ప్రాంతంలో గ్రామ సేవకుల సంఘం సమావేశం నిర్వహించారు. ఇందులో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామసేవకులను రెవెన్యూ శాఖ నుంచి వ్యవసాయ శాఖలో విలీనం చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే మార్చుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ సేవకుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి అవసరమైన పోరాటాలు చేపట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పోచయ్య, మండల సంఘం అధ్యక్షుడు సీహెచ్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల వీఆర్‌ఏల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చందంపేట రాజు, ఉపాధ్యక్షుడిగా రమేష్, ప్రధానకార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా దండు నారాయణ, సలహాదారుడిగా రాజు, కమిటీ డైరెక్టర్లుగా కాషయ్య, వేణు, దావేజ్, జాల వెంకటి, బాబు, యాదగిరి, భూదమ్మలు నియమితులయ్యారు.

## లాభాల వాటాను ప్రకటించకపోతే ఉద్యమిస్తాం

### ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

ఇల్లెందు : సింగరేణి కార్మికులకు 2016-17 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన లాభాల్లో 30 శాతం లాభాల వాటాను కార్మికులకు ప్రకటించకపోతే పోరాటాలను ఉద్ధృతం చేస్తామని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉప ప్రధాన కార్యదర్శి కె.సారయ్య పేర్కొన్నారు. గురువారం ఏరియాలోని 21 ఇంక్లైన్, జేకే ఉపరితల గనులు, విభాగాల్లో లాభాల వాటాను 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను గని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా 21 ఇంక్లైన్ గనిపై పిట్ కార్యదర్శి కోటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటైన ద్వారా సమావేశంలో సారయ్య మాట్లాడుతూ గుర్తింపు సంఘం గెలిచినప్పటి నుంచి కార్మికుల సమస్యలను పట్టించుకున్న దఖలాలు లేవని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, కార్మికుల శ్రేయస్సు కోసం ఏఐటీయూసీనే ఈ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు పట్టం కట్టాలని కోరారు.

సింగరేణి యాజమాన్యం లాభాల వాటాను తప్పుడు లెక్కలతో విడుదల చేసిందనీ, వాస్తవాలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేబీసీసీఐ సమావేశాల్లో కార్మికులకు మెరుగైన వేజ్‌బోర్డు, మెడికల్ స్కీం, క్యాడర్‌స్కీం తదితర హక్కులను సాధించేందుకు కోల్ ఇండియాతో సంప్రదింపులు, చర్చలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమాల్లో బ్రాంచి కమిటీ నాయకులు జి.నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, బొల్లి కొమరయ్య పాల్గొన్నారు.

## మద్యపానాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం : భాజపా




మహబూబ్‌నగర్ : ప్రభుత్వం మద్యపానాన్ని ప్రోత్సహిస్తోందని భాజపా జిల్లా అధ్యక్షురాలు పద్మజారెడ్డి విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో భాజపా మహిళా మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మజారెడ్డి మాట్లాడుతూ మద్యం ఏరులై పారుతున్నా, మహిళల పరిస్థితి దయనీయంగా మారుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ఒక్క మహిళకు కూడా స్థానమివ్వలేదని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. మహిళా అభ్యున్నతికి పాటుపడని తెరాస ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపాల్సిన అవసరం ఉందని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రామేశ్వరి పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో మహిళా మోర్చా సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా చైతన్యం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పద్మవేణి, శశికళ, నూర్జహాన్, రాజేశ్వరి, లక్ష్మి, నిరంజనమ్మ, పోషమ్మ, క్రిష్ణవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ నెలాఖరు వరకు సమగ్ర భూ సర్వే: జేసీ

వలిగొండ : వచ్చే నెల 15 నుంచి డిసెంబర్ చివరికల్లా రైతులకు సంబంధించిన భూముల వివరాలను పూర్తిస్థాయిలో సర్వే చేసి 90శాతం వరకు ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నట్లు జేసీ రవినాయక్ తెలిపారు. వలిగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాదాబైనమాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న రైతులకు 13బి పట్టాను అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సాగునీటి అవసరాలకై చేపడుతున్న ప్రాజెక్టుల నిర్మాణం నిమిత్తం భూసేకరణ జరుగుతుందన్నారు. భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న ధరకు మూడురెట్లు అధికంగా పరిహారం చెల్లిస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం విషయంలో రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో చౌటుప్పల్, భువనగిరి ఆర్డీవోలు సూరజ్‌కుమార్, భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ యాదయ్య, వీఆర్వో నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### 15, 16 తేదీల్లో జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహబూబ్‌నగర్ : జిల్లా పరిషత్తు పరిధిలోని ఏడు స్థాయీసంఘాల సమావేశాలు సెప్టెంబరు 15, 16 తేదీల్లో జిల్లా పరిషత్తు అధ్యక్షుడు బండారి భాస్కర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో డి.కొమురయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం 11 గంటలకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మధ్యాహ్నం 2 గంటలకు విద్య, వైద్యసేవలు, స్త్రీశిశుసంక్షేమం స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 16న ఉదయం 11 గంటలకు సాంఘిక సంక్షేమం, నిర్మాణ పనులు, మధ్యాహ్నం 2 గంటలకు ప్రణాళిక ఆర్థిక స్థాయీసంఘం సమావేశాలుంటాయని తెలిపారు. జడ్పీటీసీ సభ్యులతోపాటు ఆయా కమిటీల్లోని సభ్యులు హాజరు కావాలని కోరారు.

### 27, 28తేదీల్లో ఉభయ జిల్లాల్లో రేణుక పర్యటన

ఖమ్మం : ఈనెల 27, 28 తేదీల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ రేణుకాచౌదరి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటిస్తారని పీఏ కె. పుల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఉభయ జిల్లాల్లో జరగనున్న అధికారిక కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు. 27న ఉదయం 10గంటలకు ఖమ్మం చేరుకుని వెలుగుమట్ల అటవీ పార్కును సందర్శిస్తారు. అనంతరం బయలుదేరి సుజాతనగర్ వెళ్లి అక్కడ నుంచి కొత్తగూడెంలోని సింగరేణికాలరీస్‌కు వెళ్లి స్థానిక అంశాలపై చర్చిస్తారు. తర్వాత పాల్వంచ కేటీపీఎస్‌ను సందర్శించి అక్కడ నుంచి బయలుదేరి భద్రాచలం ఐటీసీ అతిథిగృహంలో బసచేస్తారు. 28 ఉదయం ఏడు గంటలకు భద్రాచలం దేవాలయాన్ని సందర్శించిన అనంతరం మణుగూరు వెళ్తారు. అక్కడ కార్యక్రమాల్లో పాల్గొన్న తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

### సర్వేయర్ ఉద్యోగాల దరఖాస్తులకు ఆహ్వానం

భువనగిరి : జిల్లాలోని సర్వే, ల్యాండ్ రికార్డ్ కార్యాలయంలో పనిచేయుటకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఆరుగురు లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీమ్ కార్యదర్శి జి.మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆదిలాబాద్‌లో మానవ హక్కుల వేదిక మహాసభ

### ఉభయ రాష్ట్రాల కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు



ఉట్నూరు : ప్రకృతి ఒడిలో నివసిస్తూ భావితరాలకు వనరులను రక్షిస్తున్న ఆదివాసీల జీవనం నేడు సంక్షోభంలో కూరుకుపోయిందని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల కార్యదర్శి ఆత్రం భుంజగ్‌రావు అన్నారు. ఆదివాసుల జీవించే హక్కును కాపాడేందుకు సంఘటిమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఉట్నూరు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ఎదర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ఈనెల 27న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌భవన్‌లో ఉదయం 11 గంటలకు మానవ హక్కుల వేదిక 6వ మహాసభను నిర్వహించనున్నామన్నారు. రాజ్యాంగం ప్రకారం గుర్తించిన 5వ షెడ్యూల్ ప్రాంతం లోని ఆదివాసీలను నిరాశ్రయులు చేస్తూ బొగ్గుగనుల తవ్వకాలు, పులుల సంరక్షణ కేంద్రంను ఏర్పాటు చేశారన్నారు. 1/70, పీసా వంటి చట్టాలకు తూట్లుపొడుస్తూ గ్రామ సభలు పెట్టకుండా గిరిజనేతరులకు హక్కులను కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ గిరిజనులకు తాగడానికి కనీసం రక్షిత నీరు లేక వ్యాధుల బారినపడి మృత్యువాత పడుతున్నా రన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, నాయకులు రాయిశ్రీనివాస్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి



మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అన్ని పాఠశాలల్లో చేపట్టాల్సిన హరితహారం లక్ష్యాన్ని చేరుకోవాలని, ఆ దిశగా చర్యలు వేగిరం చేయాలని పాలనాధికారి భారతి హోళికెరి సూచించారు. ఆమె కలెక్టరేట్‌లో మండలాల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. జిల్లాలో అన్ని పాఠశాలల్లో 1.58 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు, ప్రతి ఒక్కరూ దానికనుగుణంగా మొక్కలు నాటాలని స్పష్టంచేశారు. పాఠశాలల్లో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని, తాను పాఠశాలలను తనిఖీ చేసినప్పుడు ఖాళీ ప్రదేశం కనిపించకూడదన్నారు. అనంతరం మండలాల వారీగా లక్ష్యాన్ని పాలనాధికారి ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి కంటి, రక్తపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వినాయక చవితిని పురస్కరించుకొని ఈ-గణేశ్ ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు, ప్రతి విద్యార్థి పోటీల్లో పాల్గొనేలా చూడాలని చెప్పారు. జిల్లా విద్యాధికారి సరోజినిదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, నోడల్ అధికారి మధుమోహన్ పాల్గొన్నారు.

## రాయితీలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి

### ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

కొత్తకోట : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖను, మత్స్యకారుల్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చేస్తున్న ప్రయత్నంలో ప్రతి చేపకు ఓ లెక్క ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి అన్నారు. సరళాసాగర్ అతిథి గృహం వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా మత్స్యకారులకు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి, జడ్పీ ఛైర్మన్ బండారి భాస్కర్, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నారెడ్డి అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గత ఏడాది ప్రధాన జలాశయాల్లో ప్రభుత్వం చేపపిల్లల్ని తెచ్చి వదిలిందని ఇవి చాలవన్నట్లు మత్స్యకారులు మరిన్ని చేపల్ని తెచ్చి అందులో వదులు కోవడం వల్ల నీటి నిల్వ కంటే చేపల శాతం ఎక్కువై అవి పెరగక పోవడంతో మత్స్యకారులు లాభాలు పొందలేక పోయారన్నారు. ఈ ఏడాది గొలుసుకట్టు చెరువులు అభివృద్ధి చెందినందున మూడు నెలల పాటు నీళ్లుండే అన్ని చెరువుల్లో చేపపిల్లల్ని వదిలేందుకు ప్రభుత్వం నిశ్చయించిందని దీనిని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో రూ.కోటితో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే రూ.50 లక్షలు విడుదలయ్యాయని మరో రూ. 50 లక్షలు మంజూరు చేయిస్తామన్నారు. పెబ్బేరు, శ్రీరంగాపూర్‌లలో కూడా చేపల మార్కెట్లకు భవనాలు మంజూరయ్యాయన్నారు. 2019లో సరళాసాగర్ జలాశయాన్ని పునరుద్ధరించి చేపల ఉత్పత్తి కేంద్రాన్ని విస్తరిస్తామన్నారు. ప్రభుత్వం రాయితీతో మత్స్యకారులకు వలలు, తెప్పలు, మోపెడ్లు, ఆటోలు, డీసీఎం వాహనాలు ఇస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి మాట్లాడుతూ.. గత ఏడాది చేప పిల్లలను ప్రభుత్వమే మత్స్యశాఖ ద్వారా చెరువుల్లో విడుదల చేస్తే ఈ ఏడాది గుత్తేదారులకు అప్పగించిందని తెలిపారు. గ్రామీణ చెరువులకు అందుబాటులో ఉండేలా ఒక కేంద్రంలో చేపపిల్లలు అందుబాటులో ఉంచుతారన్నారు. ఐక్యంగా సంఘాలను అభివృద్ధి చేసుకోవాలని మత్స్యకారుల పిల్లలంతా బడికి వెళ్లేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. సరళాసాగర్ వద్ద చేపల ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించి సరళాసాగర్‌ను పర్యాటక కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చిన్నారెడ్డి కోరారు. అభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి రాధా రోహిణి, ఎఫ్‌డీవో రహెమాన్, మత్ససహకార సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సత్యనారాయణ, సీడీసీ ఛైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరమ్మ, సర్పంచి సునిత, మత్స్యకారుల సంఘం ప్రతినిధులు రంగస్వామి, రాములు, మన్యం , తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## అదరగొట్టాడు

### 'అర్జున్ రెడ్డి' రివ్యూ

'అర్జున్ రెడ్డి'.... ఈ మధ్యకాలంలో ఈ సినిమాకు వచ్చినంత హైప్ మరే సినిమాకు రాలేదు. దీనిపై భారీ అంచనాలు ఏర్పడటానికి కారణం టీజర్, ట్రైలర్. వాటి ద్వారా మా సినిమాలో స్టార్లు లేక పోయినా మంచి కంటెంటు ఉందని ప్రేక్షకుల్లో నమ్మకం కలిగించారు. 3 నిమిషాల నివిడితో కట్ చేసిన ట్రైలర్ ద్వారా.... ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెంచారు. ఆ ఇంపాక్ట్ టాలీవుడ్ ప్రేక్షకులపై ఏ రేంజిలో పడిందంటే..... సినిమా రిలీజ్ ముందు రోజు రాత్రి హైదరాబాద్‌లో 60కిపైగా స్పెషల్ షోలు వేస్తే అవన్నీ హౌస్ ఫుల్ అయ్యేంతలా. అసలు అర్జున్ రెడ్డి కాన్సెప్ట్ ఏమిటి? ఎలాంటి సినిమా? ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించింది అనేది రివ్యూలో చూద్దాం. డాక్టర్ అర్జున్ రెడ్డి(విజయ్ దేవరకొండ) మంగుళూరులోని సెయింట్ మేరీ కాలేజీ ఫైనలియర్ మెడికల్ స్టూడెంట్. టాప్ ఆఫ్ ది క్లాస్, టాపర్ ఆఫ్ ది యూనివర్శిటీ. అయితే యాంగర్ మేనేజ్మెంటులో జీరో. కోపం వస్తే ఆదుపుచేసుకోలేడు. ఓ చిన్న గొడవలో క్షమాపణ చెప్పడం ఇష్టం లేని అర్జున్ రెడ్డి కాలేజీ వదిలి వెళ్లివెళ్లేందుకు సైతం సిద్ధమవుతాడు. అదే సమయంలో ఫస్టియర్లో కొత్తగా జాయినైన ప్రీతి(శాలిని)ని చూసి మనసు పారేసుకుంటారు. కాలేజీ వదిలి వెళ్లాలనే తన నిర?యాన్ని మార్చుకుంటాడు. ఇద్దరి మధ్య లవ్ లివ్ ఇన్ రిలేషన్ షిప్ స్థాయికి వెళ్లిపోతుంది. అర్జున్ రెడ్డి, ప్రీతి పెళ్లి చేసుకోవాలనుకుంటారు. అయితే కులాలు వేరు కావడం వల్ల ప్రీతి తండ్రి నుండి నిరాకరణ ఎదురవుతుంది. ఈ క్రమంలో ప్రీతి తండ్రితో గొడవ పడ్డ అర్జున్ రెడ్డి తాను కావాలో, తండ్రి కావాలో తేల్చుకోవాలని.... 6 గంటల్లోగా ఏదో ఒక నిర?యం తీసుకోవాలని గొడవపడి వచ్చేస్తాడు. తన కోపాన్ని కంట్రోల్ చేసుకోవడానికి మత్తుమందు తీసుకుంటాడు. అయితే అప్పటికే





ఫుల్లుగా మందు కొట్టడంతో రెండు రోజుల పాటు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతాడు. అపస్మారక స్థితి నుండి బయటపడి అర్జున్ రెడ్డి కళ్లు తెరిచే లోపు ప్రీతికి ఇంట్లోవాళ్లు బలవంతంగా పెళ్లి చేస్తారు. అంతా అయిపోయాక అర్జున్ వెళ్లి గొడవపడినా ఫలితం లేకుండా పోతోంది. పైగా ప్రీతి బంధువుల నుండి తన్నులు తిని వస్తాడు. తన పరువు తీశావనే కోపంతో అర్జున్ రెడ్డిని తండ్రి ఇంటి నుండి గెంటేస్తాడు. ప్రీతి జ్ఞాపకాల నుండి బయట పడలేక తాగుడుకు, డ్రగ్స్‌కు బానిసైపోతాడు, చివరకు పిచ్చోడిలా రోడ్డున పడేస్థాయి వస్తాడు.... ఆ తర్వాత కథ థియేటర్లో చూస్తేనే బావుంటుంది.

### అల్లరి నరేష్

## 'మేడమీద అబ్బాయి' ట్రైలర్



అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం మేడమీద అబ్బాయి. జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీమతి నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. నిఖిల విమల్ కథానాయిక. జి.ప్రజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణను పూర్తిచేసుకున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ కొత్తదనంతో కూడిన కథతో చేస్తున్న విభిన్న చిత్రమిది. నరేష్ కెరీర్‌లో మరో మైలురాయిలా ఈ చిత్రం నిలిచిపోతుందనే నమ్మకం ఉందన్నారు. గమ్యం శంభో శివ శంభో తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేష్ చేస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా వుంటుంది. సహజమైన అంశాలతో థ్రిల్లింగ్ వుంటూనే నరేష్ శైలి వినోదం వుంటుంది. సెప్టెంబర 8వ తేదీన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకరావడానికి ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు. అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సుధ, సత్యం రాజేష్, మధునందన్, జబర్దస్త్ ఆది, పద్మ జయంతి, రవిప్రకాష్, వెన్నెల రామారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఉన్ని ఎస్ కుమార్, సంగీతం: షాన్ రెహమాన్, ఆర్ట్: రాజీవ్ నాయర్, ఎడిటర్: నందమూరి హరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎం.ఎస్.కుమార్, సమర్పణ: శ్రీమతి నీలిమ, నిర్మాత: బొప్పన చంద్రశేఖర్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జి.ప్రజిత్.

## ఎన్టీఆర్ "జై లవకుశ" లుక్

ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న 'జై లవ కుశ' చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. బాబీ దర్శకత్వం వహిస్తున్నఈ చిత్రాన్ని ఎన్టీఆర్ సోదరుడు కళ్యాణ్ రామ్ నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో ఎన్టీఆర్ మూడు విభిన్నమైన పాత్రలు పోషిస్తున్నారు. జై, లవ, కుశ మూడు పాత్రల్లో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన 'జై' టీజర్ కు అదుతేమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా లవ కుమార్ క్యారెక్టర్ పరిచయం చేస్తూ టీజర్ రిలీజ్ చేశారు. ఆ ఆనందం నుంచి పూర్తిగా తేరుకోకముందే వినాయక చవితి సందర్భేగా ఎన్టీఆర్ అప్‌కమింగ్ మూవీ 'జైలవకుశ' నుండి గురువారం 'లవకుమార్' టీజర్ విడుదల చేసి అభిమానులకు పండుగ గిఫ్ట్ ఇచ్చిన ఎన్టీఆర్.. తాజాగా 'కుశ'ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. బాబీ డైరెక్షన్‌లో వస్తున్న 'జై లవకుశ' మూవీలో ఎన్టీఆర్ 'జై, లవకుమార్, కుశ'లుగా త్రిపాత్రాభినయం చేస్తుండగా ఇప్పటికే 'జై, లవ, ఫస్ట్‌లుక్ టీజర్‌లు రిలీజ్ చేయగా వినాయక చవితినాడు 'కుశ' ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి ఫ్యాన్స్‌లో జోష్ నింపాడు ఎన్టీఆర్. ఈ లుక్ లో ఎన్టీఆర్ డిఫరెంట్ హెయిర్ స్టైల్ తో ట్రెండీగా కనిపిస్తున్నాడు. ఈ నెలాఖరున కుశ టీజర్ ను కూడా రిలీజ్ చేసి సెప్టెంబర్ 3న అభిమానుల సమక్షంలో ఆడియో రిలీజ్ ను ఘనంగా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సినిమాను సెప్టెంబర్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నారు. కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రాశీఖన్నా, నివేదా థామస్ లు హీరోయిన్లు గా నటిస్తున్నారు.





## న్యూడ్ సీన్ ఇలియానా ఐడియా

సౌత్ సినీ పరిశ్రమకు గుడ్ బై చెప్పి బాలీవుడ్లో సెటిలైన హీరోయిన్ ఇలియానా.... అక్కడ పెద్ద స్టార్ అయ్యేందుకు చాలా కష్టపడుతోంది. కొన్ని విషయాల్లో తానే స్వయంగా చొరవ తీసుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఇలియానా త్వరలో 'బాద్‌షాహో' అనే బాలీవుడ్ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రంలో ఆమె అజయ్ దేవగన్ ప్రియురాలిగా, రాయల్ లేడీ పాత్రలో కనిపించబోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆమె ఈ చిత్రంలో కొన్ని బోల్డ్ సీన్లు చేసింది. సినిమాకు సంబంధించి ఇప్పటికే విడుదలైన ఓ సాంగులో ఇలియానా జాకెట్ విప్పేసి న్యూడ్‌గా కనిపించింది. ఎన్నడూ లేని విధంగా ఇలియానా ఇంత బోల్డ్‌గా నటించడం హాట్ టాపిక్ అయింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇలియాన ఈ సీన్ గురించి మాట్లాడారు. ఆ పాట చివర్లో జాకెట్ విప్పేసి న్యూడ్‌గా కనిపించాలనే ఐడియా తనదే అని, దర్శకుడికి కూడా నేను చెప్పింది నచ్చడంతో ఓకే చెప్పాడని ఇలియానా తెలిపారు. సెట్లో ఆ సీన్ అయిపోగానే..... వేరొకరు నాకు వేసుకోవడానికి బట్టలు తెచ్చి ఇచ్చే వరకు అతడే నాకు కవచంలా ఉన్నారు. అజయ్ ఒక జంటిల్‌మెన్, అందుకే అతడితో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ సీన్ చేయగలిగాను అని ఇలియానా..... ఈ విషయాలన్నీ చాలా బోల్డ్‌గా చెప్పేసింది.



# సరి లేరు.. నీకెవ్వరూ.. ఓ ధోనీ..



న్యూఢిల్లీ: జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు, ఓటమి దిశగా వెళ్తున్న సమయంలో తీవ్ర ఒత్తిడిని జయించి తనదైన శైలిలో ప్రశాంతంగా ఆడి జట్టుకు మంచి ముగింపు అందించడం ధోనీకి అలవాటు. అందుకే అభిమానులు అతడని బెస్ట్ ఫినిషర్ అంటారు. అడపాదడపా మ్యాచ్‌ల్లో తప్ప అత్యధిక మ్యాచ్‌లో జట్టుకు మహీ వూహించని విజయాలు అందించాడు కూడా. గురువారం అతడి ఆటతీరే ఇందుకు నిదర్శనం. ప్రస్తుతం బ్యాట్స్‌మన్, కీపర్‌గా రాణిస్తున్న అతడు పలు మైలురాళ్లను అధిగమిస్తూ.. నూతన రికార్డులను తన పేరిట లిఖించుకుంటున్నాడు.

1. వికెట్ల వెనుక అత్యంత అప్రమత్తంగా ఉండే ధోనీ స్టంపుల్లో సరికొత్త రికార్డును అందుకోబోతున్నాడు. గురువారం శ్రీలంకతో జరిగిన వన్డేలో ఆతిథ్య బ్యాట్స్‌మన్ గుణతిలకను స్టంప్ చేయడం ద్వారా లంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కర పేరిట ఉన్న (99 స్టంపులు) రికార్డును ధోనీ సమం చేశాడు. మరొక స్టంప్ చేస్తే అత్యధిక స్టంపింగ్ రికార్డు మహీకే దక్కుతుంది.

2. పల్లెకెలె స్టేడియంలో 45 పరుగులతో రాణించి నాటౌట్‌గా నిలిచాడు ధోనీ. దీంతో అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక సార్లు (120) అజేయుడిగా నిలిచిన తొలి క్రికెటర్‌గా కూడా ఘనత సాధించాడు. అతని కంటే ముందు శ్రీలంక మాజీ క్రికెటర్ మురళీధరన్ (119)ను తాజాగా ధోనీ అధిగమించాడు.

3. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన భువనేశ్వర్, ధోనీ జోడీ 8వ వికెట్‌కు అబేధ్య శతక భాగస్వామ్యంతో ఆకట్టుకుంది. వన్డేల్లో శ్రీలంకతో 8వ వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం. 2014 నవంబర్‌లో విరాట్ కోహ్లీ, అక్షర్ పటేల్ జోడీ 57 పరుగుల భాగస్వామ్యంతో మెరిసింది.

4. విజయవంతమైన ఛేదనల్లో అజేయంగా నిలిచిన రికార్డు సైతం ధోనీ పేరిటే ఉంది. అతడు 39 ఇన్నింగ్స్‌ల్లో నాటౌట్‌గా నిలిచాడు. అతని తర్వాత జాంటీ రోడ్స్ 33, రికీ పాంటింగ్ 31, అజారుద్దీన్/కలీస్ 30 స్థానాల్లో ఉన్నారు.

# ప్రజాస్వామ్య విలువలను ఖూని చేస్తున్న ప్రభుత్వం



హైదరాబాద్: ప్రజాస్వామ్య విలువలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఖూనీ చేస్తోందని, గణపురం మత్స్యకార్మిక సంఘం ఛైర్మన్ ఎన్నికను కావాలనే కుట్రతో తెరాస నేతలు వాయిదా వేయించారని తెదేపా జిల్లా అధ్యక్షుడు గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. డైరెక్టర్లుగా గెలిచిన తొమ్మిది మంది సభ్యుల్లో ఐదుగురు తెదేపా శిబిరంలో ఉండగా నలుగురు సభ్యులు తెరాస శిబిరంలో ఉన్నారన్నారు. తెదేపా శిబిరంలో ఉన్న గణపురం శివారు బుర్రకాయలగూడెం గ్రామానికి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన మునిగాల రమేష్ తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులు, మత్స్యకార్మికులు కలిసి భూపాలపల్లిలోని తెదేపా కార్యాలయానికి వచ్చారు. తమ కుమారుడిని అప్పగించాలని రమేష్ తండ్రి మూగయ్యతో పాటు కుటుంబ సభ్యులు సత్యనారాయణరావును వేడుకున్నారు. సత్యనారాయణరావు మాట్లాడుతూ.. మత్స్యకార్మిక సంఘం ఛైర్మన్ ఎన్నికను వాయిదా వేయాలని ఎన్నికల అధికారిని ఫోన్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి భయభ్రాంతులకు గురిచేశారని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. తెదేపా సభ్యత్వం కల్గిన మునిగాల రమేష్‌ను తానే పోటీ చేయాలని చెప్పానని, ఆయన గెలుపునకు కూడా తాను పూర్తిగా సహకరించటం వల్లనే తెదేపా శిబిరంలోకి ఆయన స్వచ్ఛందంగా వచ్చారడన్నారు. తాను ఎవరినీ కిడ్నాప్ చేయలేదని, ఐదుగురు సభ్యుల ఇష్టం మేరకే వారు శిబిరంలో ఉన్నారని, ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాలని డె%రెక్టర్ రమేష్ గురువారం హైకోర్టులో కేసు కూడా వేశారని ఆయన పేర్కొన్నారు. తెరాస నాయకులు ఓటమి భయంతోనే బుర్రకాయలగూడెం వెళ్లి రమేష్‌ను తెరాస శిబిరంలోకి పంపించాలని మత్స్యకార్మికులను బెదిరించటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తెరాస నాయకుల బెదిరంపులకు, పోలీసు కేసులకు తాము భయపడేది లేదన్నారు.

# మట్టి గణపతులకు ప్రత్యేక పూజలు



నర్సంపేట: పర్యావరణ పరిరక్షణను కోరుతూ నీటి కాలుష్యం నివారించే లక్ష్యంతో నర్సంపేట పట్టణంలో జనతా యూత్, శ్రీశివాంజనేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో మట్టి గణపతుల ప్రతిమలను ప్రతిష్ఠించారు. నవరాత్రుల ఉత్సవ పూజలను ప్రారంభించారు. ఈ సందర్భం గా నిర్వాహకులు మురళి, నిరంజన్ మాట్లాడుతూ.. పండుగలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘాల సభ్యులు రాజు, శ్రీకాంత్, బొందయ్యగౌడ్, రామారావు, యాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## తెల్ల ఆవగింజపై గణనాథుడు



కాచిగూడ: తెల్ల ఆవగింజపై గణ నాథుడి బొమ్మను చిత్రీకరించి... సూక్ష్మ కళాకారుడు డాక్టర్ ముంజంపల్లి విద్యాధర్ మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. ఎనిమిది గంటల పాటు కష్టపడి ఈ ఘనతను సాధించడం విశేషం.

# సెమీస్‌లో సైనా ఓటమి



గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సెమీ ఫైనల్స్ వుమెన్స్ సింగిల్స్‌లో భారత షట్లర్ సైనా నెహ్వాల్ నిరాశ పరిచింది. తన ప్రత్యర్థి జపాన్ షట్లర్ నొజోవా ఒకుహర చేతిలో ఓటమి పాలైంది. ఎన్నో ఆశల మధ్య సెమీస్‌లోకి అడుగుపెట్టిన సైనా.. చివరికి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. తొలి గేమ్‌లో దూకుడు ప్రదర్శించి విజయాన్ని సొంతం చేసుకున్న సైనా.. ఆ తర్వాత వరుస గేముల్లో ఓటమి పాలైంది. తొలి గేమ్‌లో 21-12తో విజయం సాధించిన సైనా ఆ తర్వాత 17-21, 10-21తో వరుస గేముల్లో ఓటమి పాలైంది.

తొలుత రెండో గేమ్ ఉత్కంఠగా సాగింది. ఇద్దరి మధ్యా ఒకానొక సమయంలో పాయింట్లు సమానమైనప్పటికీ చివరికి ఒకుహరనే పై చేయిగా నిలిచి 21-17 తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక మూడో గేమ్‌లో ఒకుహర మొదటి నుంచీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. దాంతో సైనా 20-10 పాయింట్ల తేడాతో ప్రత్యర్థి చేతిలో సైనా ఓటమి పాలైంది.

శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో స్కాట్లాండ్ క్రీడాకారిణి గిల్‌మార్‌పై విజయం సాధించి సెమీస్‌లోకి అడుగుపెట్టిన సైనా.. చివరికి సెమీస్‌లో ఓటమి పాలై కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# ప్రభుత్వ బడుల్లోకి అంగన్‌వాడీలు

గన్‌ఫౌండ్రి: జిల్లాలో అద్దె భవనాలలో కొనసాగుతున్న అంగన్‌వాడి కేంద్రాలను గుర్తించి ఆ కేంద్రాలను సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు తరలించేందుకు వీలుగా తగిన ప్రతిపాదనలు రూపొందించి పంపించాలని హైదరాబాదు జిల్లా కలెక్టర్ యోగితారాణా ఆదేశించారు. సెప్టెంబరు 30వ తేదిలోపు ఈ పని పూర్తి కావాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యక్రమాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అద్దె భవనాలలోని అంగన్‌వాడి కేంద్రాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా గదులుంటే వాటిల్లో ఏర్పాటు చేసేందుకు గానీ, స్థలముంటే నూతనంగా భవనాన్ని నిర్మించేందుకు వీలుగా ప్రతిపాదనలు రూపొందించాలని సీడీపీఓలు, సూపర్‌వె%జర్లను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.ప్రశాంతి, సంక్షేమ అధికారి సునంద, ఎల్‌పీఓ రాధిక రమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే తట్టు, పొంగు టీకాలను మదర్సాలలో చదివే పిల్లలు తప్పనిసరిగా వేసుకునే విధంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ యోగితారాణా మసీదుల ఇమాంలను కోరారు. పాతనగరంలో ముస్లిం మత పెద్దల సహకారం తీసుకోవడంలో భాగంగా గురువారం మసీదుల జమియత్-ఉల్-మా అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులతో జేసీతో కలిసి తన చాంబర్‌లో సమావేశాన్ని నిర్వహించారు.

# 'చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి'

## కాకినాడ ప్రచారంలో ఎమ్మెల్యే రోజా



కాకినాడ: ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలుచేయని చంద్రబాబుకు ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పాలని కాకినాడ ఓటర్లకు వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా పిలుపునిచ్చారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా 31, 32వ డివిజన్లలో శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పాలన తీరుపై నిప్పులు చెరిగారు. బుద్ధిలేని కుమారునికి మంత్రి పదవి ఇప్పించుకున్న చంద్రబాబు.. లక్షలాది యువతలో ఏ ఒక్కరికీ ఉద్యోగం కల్పించలేదని విమర్శించారు. తమ ఓటు ద్వారా బాబుకు బుద్ధి చెప్పాలని ఆమె సూచించారు.

## క్రమశిక్షణ, పట్టుదలతో విజయాలు

కరీంనగర్ : క్రమశిక్షణ కలిగి పట్టుదలతో కృషి చేసే విద్యార్థులు అన్నింటా విజయాలు సాధిస్తూ సమాజంలో గౌరవప్రదంగా నిలుస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామంలోని సహజ మహిళా యంత్ర కళాశాలలో నిర్వహించిన స్వాగతోత్సవ వేడుకను కళాశాల ఛైర్మన్ డాక్టర్ పి.రవిందర్‌రావు, ముఖ్య అతిథి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజగోపాల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

సీనియర్ విద్యార్థులు కళాశాలలో కొత్తగా ప్రవేశాలు పొందిన జూనియర్లకు మార్గదర్శకులుగా నిలువాలని సూచించారు. కళాశాలలో చేరిన రోజు నుంచే లక్ష్యసాధనకు అనుగుణంగా శ్రమిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల డీన్ డాక్టర్ ఎ.బ్రహ్మయ్య, ప్రిన్సిపాళ్లు డాక్టర్ నల్ల శ్రీనివాస్, డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో పోటీచేస్తున్న

# భాజపా అభ్యర్థుల విజయం ఖాయం

### విశాఖ నగర భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రేమకుమారి



కాకినాడ: కాకినాడలో జరగనున్న మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో భాజపా తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు ఖాయమని విశాఖ నగర భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. ప్రేమకుమారి స్పష్టం చేసారు. శనివారం కాకినాడలో జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం విశాఖ నగరం నుంచి ప్రచారం నిమిత్తం కాకినాడ మునిసిపల్ వార్డులలో కలియ తిరుగుతూ భాజపా గెలుపునకు కార్యకర్తలందరూ కృషి చేయాలని విస్తృత ప్రచారం చేశారు. భారతదేశ అభివృద్ధికి మోదీ చేస్తున్న కృషి, వారు ప్రవేశపెట్టిన పథకాలు గురించి వివరిస్తూ మోదీ పాలనలో భారత దేశం సాధిస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. నగర భాజపా మహిళా మోర్చా ఆద్వర్యంలో కాకినాడలోని పలువార్డులలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న 9వ వార్డు అభ్యర్థి మాల కొండయ్య గెలుపును కోరుతూ ప్రచారం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం భాజాపా అభ్యర్థి గెలుపుకు దోహద పడతాయని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోది అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సానుకూలం గా స్పందిస్తున్నారని అన్నారు. ఇంటింట ప్రచారంలో ఓటర్లు తమ అభ్యర్థికి పెద్ద మెజార్టీ చేకూర్చేందుకు సానుకూలత వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. తప్పక తమ అభ్యర్థులు గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర భాజపా మహిళా మోర్చా ప్రతినిధులు, విశాఖ నగర నాయకులు శివాజీ రాజా బహద్దూర్, కొప్పల బద్రి, మహిళనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రూపన్‌వాలా నివేదిక ప్రతులు దహనం

## హెచ్‌సీయూలో విద్యార్థుల నిరసన



మాదాపూర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి రోహిత్ వేముల మృతిపై తయారుచేసిన రూపన్‌వాలా నివేదికను వ్యతిరేకిస్తూ విద్యార్థులు క్యాంపస్‌లో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం నివేదిక ప్రతులను దహనం చేసి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రూపన్‌వాలా నివేదిక ఏకపక్షంగా ఉందని, పూర్తిగా రాజకీయంగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంటులో ఈ నివేదికను తిరస్కరించాలన్నారు. రోహిత్ ఆత్మహత్య విషయంలో నిజనిజాలను వెలకితీయాలన్నారు. ఇందుకు ప్రత్యేక కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ అధ్యాపకులు లక్ష్మీనారాయణ, తిరుమల్, విజయ్, నేతలు ప్రశాంత్, మున్నా, అర్పిత తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా ఆధ్వర్యంలో

# రహదారుల దిగ్బంధం

నర్సంపేట: నర్సంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నర్సంపేట పట్టణానికి చెందిన ఆరు ప్రధాన మార్గాలను దిగ్బంధం చేశారు.

నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆరు బృందాలుగా విడిపోయి 365 నెంబరు జాతీయ రహదారితో పాటు ఆరు మార్గాలను దిగ్బంధం చేశారు. దీంతో పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన విరమింపచేసి రాకపోకలను పునరుద్ధరించారు.




VIJAYABHANU - Hyderabad

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com